


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 08-07-2026 బుధవారం | సంపుటి : 14 | సంచిక :202 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal Follow us on

* 2008 నాటి అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో 38 మంది దోషులకు గతంలో ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్షను, మరో 11 మందికి విధించిన జీవిత ఖైదును కోర్టు సమర్థించింది. జస్టిస్ ఎ.వై. కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అన్ని అప్పీళ్లను తోసిపుచ్చింది. నిషేధిత ఉగ్రవాద సంస్థ 'ఇండియన్ ముజాహిదీన్' సభ్యులకు ప్రత్యేక కోర్టు విధించిన శిక్షలను ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. అలాగే, నిందితుల అప్పీళ్లన్నింటినీ హైకోర్టు తిరస్కరించింది. దీనితో పాటు, మృతుల బంధువులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష పరిహారం ఇవ్వాలని పేర్కొంది.

## నాటి తీర్పు సబబే



# 38 మందికి మరణశిక్ష




## అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు తీర్పు

**మరణశిక్షను సమర్థించిన హైకోర్టు**

**మరో 11 మందికి జీవిత ఖైదు**

**ఈ కేసులో 77 మందిపై అభియోగాలు**

**2008లో అహ్మదాబాద్‌లో జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది మృతి, 200 మందికి గాయాలు**

*చట్టప్రకారం దిగువ కోర్టు విధించిన మరణశిక్ష అమలు కావాలంటే హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి అవుతుంది. ఈ నేపథ్యంలో దాదాపు రెండేళ్లకు పైగా విచారణ జరిపిన గుజరాత్ హైకోర్టు, తాజాగా ఆ శిక్షలను ఖరారు చేస్తూ తుది తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా 2008 అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసుపై ప్రభుత్వ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడారు. "స్పెషల్ కోర్టు 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధించింది. గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ అప్పీళ్లను కొట్టివేసి, శిక్షల ధ్రువీకరణ పిటిషన్‌ను ఆమోదించింది.*

**అహ్మదాబాద్, జులై 7 (ఎఎంఎస్)** : అహ్మదాబాద్‌లో గతంలో జరిగిన వరుస పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్‌లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధారించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్లకు శిక్ష విధించింది.

మిగతా 2లో

# పాలనలో మరింత పారదర్శకత

## పరిపాలనలో పారదర్శకత కోసం పూర్తిస్థాయిలో డిజిటలైజ్ : సిఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు

1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలన్ని డిజిటలైజ్ లో

4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో

4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదు

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవచ్చిన అధికారులు

ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా,

ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదు

పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక

ఉన్నత స్థాయి కమిటీని నియమించాలి

అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలి

సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జులై 7 (వుదయం ప్రతినిధి) :** పరిపాలనలో మరింత పారదర్శకత కోసం వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా డిజిటల్ గవర్నెన్స్

మిగతా 2లో

* డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్టంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



* *రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు*
* *10 ఆర్డీవో, 107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం*
* *రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి*

**హైదరాబాద్, జులై 7 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.

మిగతా 2లో

## బీసీ స్టడీ సర్కిల్స్

# బలోపేతానికి ప్రత్యేక కమిటీ

**గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్ కు ప్రాధాన్యం**

**జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు అవకాశం**

**స్కిల్ డెవలప్మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు**

**ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి**

**బీసీ సంక్షేమ శాఖలో సంక్షేమం, నాణ్యత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత**

**బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం**



**హైదరాబాద్, జులై 7 (ఎఎంఎస్) :** గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో

మిగతా 2లో

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

**ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాలి**

**ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి**

**ముఖ్యమంత్రికి విద్యావేత్తలు, మేధావులు,**

**పౌర సమాజం బహిరంగ బహిరంగ లేఖ**




**హైదరాబాద్, జులై 7 (ఎఎంఎస్) :** రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో ద హిందూ హడల్ కాంక్లేవులో ప్రకటించడానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ విద్యావేత్తలు మేధావులు ప్రముఖ కవులు ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వంద మందికి పైగా వివిధ రంగాలకు చెందిన మేధావులు ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖను రాశారు. మంగళవారం జులై 7 2026 రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో పత్రికా విలేఖరుల సమావేశాన్ని నిర్వహించి బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో విస్తరించి ఉన్న 23 వేల బడుల మూసివేతను ఉపసంహరించుకోవాలని, విశ్రుంఖలంగా పెరిగిపోతున్న విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణను నియంత్రించాలని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథ మిక తరగతులను ప్రవేశపెట్టాలని, అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, సరిపడా టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ప్రముఖ పాత్రికేయుడు సంపాదకులు కే రామచంద్ర మూర్తి మాట్లా డుతూ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని రాష్ట్రంలో విద్యార్థులు లేరని 23 వేల పాఠశాలల

మిగతా 2లో

# లిఫ్ట్‌ల పునరుద్ధరణకు భారీ నిధులు మంజూరు


**గత ప్రభుత్వం లిఫ్ట్‌ల నిర్వహణకు రూపాయి ఖర్చు చేయలేదు**

**అమరచింత మండలంలో రూ.6.60 కోట్లతో**

**చంద్రఘడ్ - నాగిరెడ్డి పల్లి -బెక్కరపల్లి ఎత్తిపోతల పథకాల**

**మరమ్మతు పనులకు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన**

**సన్న వడ్ల క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా**



**మక్తల్, జులై 7 (వుదయం ప్రతినిధి) :** మక్తల్ నియోజకవర్గంలోని అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామంలో చంద్రఘడ్–నాగిరెడ్డిపల్లి–బెక్కర్‌పల్లి ఎత్తిపోతల పథకాల మరమ్మత్తు పనులకు రూ.6 కోట్ల 58 లక్షల 50 వేల (దాదాపు రూ.7 కోట్లు) వ్యయంతో చేపట్టనున్న మరమ్మత్తు పనులకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లలో లిఫ్ట్‌ల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, కనీసం గ్రీజు డబ్బా కూడా ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ లిఫ్ట్‌ల పునరుద్ధరణకు భారీ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా ఉన్నప్పటికీ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేయడం తన బాధ్యత అని స్పష్టం చేసిన మంత్రి, జంగంరెడ్డిపల్లి, భూత్పూర్ ప్రాంతాల్లో కూడా కొత్త సాగునీటి పథకాలు తీసుకొస్తున్నామని వెల్లడించారు.

మిగతా 2లో

# మంత్రికి సమాచారమివ్వడా..?

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సిఎం**

**రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు**

**పరిపాలనా పరంగా అభ్యంతరకరమని,**

**నిబంధనల స్ఫూర్తిని ఉల్లంఘించడమే..**

**ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా**

**సమన్వయాన్ని దెబ్బతీయడమే లేఖలో ఫిర్యాదు**

2



## భారత్-ఇండోనేషియాల మధ్య

# ద్వైపాక్షిక సంబంధాలు

**స్నేహితులకు కాపీరైట్' వర్తించదు : ప్రబోవోతో ప్రధాని మోడీ**

**ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల అభివృద్ధికి భారత్ సాయం**

**ఉగ్ర ఘటనలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు**



**ఢిల్లీ, జులై 7 (ఎఎంఎస్) :** రామాయణ కాలం నుంచి భారత్–ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఈ బంధాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోడీ మాట్లాడారు. 2లో

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

మొదటి పేజీ తరువాయి

మూసివేసే ఆలోచన తగదని, బడులను కుదిస్తే ప్రజలు విద్యకు దూరం చేసినట్లు అవుతుందని తెలిపారు..నాక్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉందని అలాగే రాజకీయాలలో విద్య లేదని కానీ విద్యలో రాజకీయాలు ఎక్కువై పోయాయని ఆ కారణంగానే సామాజిక అవసరాలు గుర్తించకుండా పాఠశాలల మూసివేత ప్రకటన చేశారని దుయ్యబట్టారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదనే నెపంతో పాఠశాలల మూసివేత నిర్ణయాలు గైకొనడం సరికాదని వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలేంటో శాస్త్రీయంగా అధ్యయనం చేశారా అని ప్రశ్నించారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి ప్రసంగిస్తూ విద్యకు 15% నిధులు కేటాయిస్తామని గత ప్రభుత్వ మూసివేసిన 6000 పాఠశాలలను తెరిపిస్తామని తమ మేనిఫెస్టో ద్వారా హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కేవలం




8.2% మాత్రమే కేటాయించి మరియు ఏకంగా 23 వేల పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం ప్రజలను ప్రజలను వహించడమే కాగలదన్నారు. కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ 23 వేల పాఠశాలల మూసివేత ద్వారా ఉత్పన్నమయ్యే పరిణామాల పట్ల భయం గొల్పుతున్నదని సాక్షాత్తు ముఖ్యమంత్రి విద్యా మంత్రిగా ఉంటూ ఇలాంటి తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం పట్ల తన ఆక్షేపణ ప్రకటించారు. హైకోర్టు సీనియర్ అడ్వకేట్ చిక్కుడు ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వము లాగానే నేటి ప్రభుత్వం కూడా ప్రజాస్వామికంగా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదని రాజ్యాంగ పరిధిలో ప్రజా పాలన అందిస్తామని ప్రకటించి ఏకపక్షంగా 23 వేల పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడాన్ని తప్పు పట్టారు ఆర్టిఈ చట్టం ప్రకారం గ్రామానికి పాఠశాల ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి రచయిత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ పాఠశాల మూసివేత ప్రకటన సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. పాఠశాలల పరిరక్షణ మరియు బలోపేతం కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జి హరగోపాల్ ప్రసంగిస్తూ పాఠశాల మూసివేత ప్రకటన పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని బడికి గ్రామ ప్రజలకు ఉండే మానవీయ అనుబంధాన్ని తుంచి వేయడం తగదని తక్షణమే ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కే చక్రధర్ రావు మాట్లాడుతూ దేశంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందినదని అలాగే ఎక్కువ బడ్జెట్ కలిగి ఉందని అయినప్పటికీ విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తున్నారని కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యను విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలను అదుపు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని జీవో ఎంఎస్ నెంబర్ వన్ మరియు విద్యా హక్కు 1982 నిబంధనల ప్రకారం నియంత్రించలేక పోతున్నదని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ వనమాల, ఫిలిం ప్రొడ్యూసర్ సయ్యద్ రఫీక్, శంకర్ డిబిఎఫ్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం రాఘవాచారి, విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పి మహేష్, పిడిఎస్యు అధ్యక్షులు ఏ విజయ్ టి పి టి ఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, ఎం. ప్రకాష్ రావు, బి. ముత్యాలు, విజయ్ కుమార్, నర్సయ్య తదితరులు హాజరయ్యారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

## లిఫ్టుల పునరుద్ధరణకు భారీ నిధులు మంజూరు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పాలనలో రైతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని, "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులు సృష్టించారని విమర్శించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో పండిన ధాన్యం తెలంగాణ ప్రజలకే ఉపయోగపడాలనే లక్ష్యంతో రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జూరాల నీటి విషయంలో ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించిన మంత్రి, నీరు అందరిదని, సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చంద్రఘడ్ లో 950 ఎకరాల ఆయకట్టు, 705 కుటుంబాలకు రూ.1.92 కోట్లు, బెక్కర్‌పల్లి లిఫ్ట్‌కు 4,900 ఎకరాల ఆయకట్టు, 885 కుటుంబాలకు రూ.2.13 కోట్లు, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌తో కలిపి మొత్తం సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు రూ.6.58 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వివరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని, విమర్శలు చేసే వారిని గత పదేళ్లలో ఏమి చేశారో ప్రశ్నించాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆత్మకూరు పట్టణంలో 85 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న మార్కెట్ యార్డ్ కమిటీ భవన నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేశారు.

## పంది రాజుకు నియామక పత్రం అందజేత



**వుదయం, తొగుట( జూలై 7) :** తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పంది రాజు ముదిరాజ్‌కు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడిగా పంది రాజు ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, చెరుకు శ్రీనివాస్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డి, సర్పంచ్ రాంపురం రమేష్, నాయకులు చిలువేరి రాంరెడ్డి, చందా సత్తయ్య, పాత్కుల వెంకటేశం, ఉల్లెంగుల సాయి, పంది నర్సింలు, కనకయ్య, కృష్ణ గౌడ్, మెట్టు స్వామి, కన్నేశ్, స్వామి, చందు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**కోహీర్, జులై 7 (వుదయం ప్రతినిధి) :** కోహీర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న ప్రజా సంక్షేమ నిర్ణయాలకు మద్దతుగా ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అశోక్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీ రామలింగ రెడ్డి, కోహీర్ మున్సిపల్ చైర్మన్ శ్రీ అశోక్, కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి. సువర్ణ మల్లన్న పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజలతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీ మల్లికార్జున్, సీనియర్ నాయకులు అంజన్న, ప్రభాకర్ రెడ్డి, పి. కృష్ణ, పి. డేవిడ్ గారు, పి. ప్రకాష్, కె. యేసురత్నం, వార్డు సభ్యులు ఈ. అశోక్, బి. ప్రవీణ్ కుమార్ గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత్-ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు

మొదటి పేజీ తరువాయి

ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాం అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు.

## ఉమ్రా యాత్రకు బయలుదేరిన హుస్సైనీ ముజీబ్ టిఎన్జీవోఎస్ నేత ముజీవ్ కుటుంబ సభ్యులు



**హైదరాబాద్, జులై 7 (వుదయం ప్రతినిధి)** : పవిత్ర ఉమ్రా యాత్రకు కుటుంబ సభ్యులతో కలిసి బయలుదేరిన టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్. ఎం. హుస్సేనీ ముజీబ్ కు ఘనంగా వీడ్కోలు పలికారు స్నేహితులు, బంధుమిత్రులు. టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్. ఎం. హుస్సేనీ ముజీబ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా, మదీనా క్షేత్రాలకు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ నాయకులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు డా. హుస్సేనీ ముజీబ్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఉమ్రా యాత్ర అనేది ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక యాత్రలలో ఒకటి. ఈ పవిత్ర యాత్రను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించడం ఎంతో విశిష్టమైనదని పేర్కొంటూ, ఈ యాత్ర ద్వారా ఆయనకు, వారి కుటుంబ సభ్యులకు సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, అల్లాహ్ అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీఎన్ జీఓస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా డా. ఎస్. ఎం. హుస్సేనీ ముజీబ్ గారు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన చేపట్టిన ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తై క్షేమంగా స్వదేశానికి తిరిగి రావాలని అందరూ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## ఖజానాకు 'పొరుగు' కన్నం!

**గద్వాల మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ 'భూతాల' దందా!**

**పని చేయకుండానే జీతాలు.. నేతల జేబుల్లోకి లక్షల వాటాలు!**

**30 మంది 'దొంగ' ఉద్యోగుల తొలగింపు**

**మరి ఇన్నాళ్లూ దోచుకున్న సొమ్మేది?**

**బడ్జెట్ లెక్కల్లో మాయాజాలం**

**కౌన్సిల్‌లో గుట్టురట్టు చేసిన విపక్షాలు!**




**గద్వాల, జూలై 07 (వుదయం బ్యూరో) : ప్రజాధనానికి రక్షణగా** ఉండాల్సిన పురపాలక సంఘం అక్రమార్కులకు కామధేనువుగా మారింది. అర్హులైన పేదలకు ఉపాధి చూపించాల్సిన 'పొరుగు సేవలు' (అవుట్‌సోర్సింగ్) కాస్తా.. కొందరు నేతలు, అధికారుల బంధుగణానికి 'కూర్చుని తినే' జీతా ల గనులుగా మారాయి. రికార్డుల్లో పేర్లు ఉంటాయి.. కానీ వారు మున్సి పల్ గడప తొక్కరు! నెల తిరిగేసరికి ఖజానా నుంచి జీతాలు డ్రా అవు తాయి.. తెరవెనుక ఉన్న 'పెద్దల' జేబుల్లోకి వాటాలుగా చేరిపోతాయి. గద్వాల పురపాలక సంఘంలో గత కొంతకాలంగా నిశ్శబ్దంగా సాగుతున్న ఈ 'భూత' ఉద్యోగుల దోపిడీ పర్వం మున్సిపల్ కౌన్సిల్ వేదికగా బట్టబయలైంది.

**కాగితాలపై కొలువులు.. లక్షల్లో లూటీ!**

అధికారిక లెక్కల ప్రకారం మున్సిపాలిటీలో మొత్తం 273 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలో 128 మంది, ఇంజినీరింగ్, కార్యాలయాల్లో 97 మంది, డ్రైవర్లుగా 22 మంది, ఎలక్ట్రిషియన్లుగా ఆరుగురు కాగితాలపై కొలువుదీరారు. పారిశుద్ధ్య కార్మికులకు రూ.16,600, ఇంజినీరింగ్ సిబ్బందికి రూ.15,600 నుంచి రూ.19,500 వరకు వేతనాలు అందుతున్నాయి. వీరి జీతాల కోసమే మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ప్రతి నెలా రూ.46.25 లక్షలు, ఏడాదికి రూ.5.55 కోట్లకు పైగా బద్ధకస్తుల ఖాతాల్లోకి ధారపోస్తున్నారు. గత కౌన్సిల్‌లో కీలకంగా వ్యవహరించిన ఒక మాజీ కౌన్సిలర్, తన అనుచరుల పేర్లను రికార్డుల్లో పెట్టించి నెలకు రూ.లక్షకు పైగా 'మామూలు' దండుకుంటున్నారనే ఆరోపణలు మున్సిపల్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

**నిలదీసిన విపక్షం.. గుట్టు విప్పిన కౌన్సిల్ భేటీ!**

మార్చితో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఒప్పంద గడువు ముగియడంతో, రాబోయే ఆర్థిక సంవత్సరానికి పునరుద్ధరణ (రెన్యువల్) ప్రతిపాదనను అధికారులు కౌన్సిల్ ముందుంచారు. ఇదే అదనుగా ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారపక్షంపై విరుచుకుపడ్డారు. క్షేత్రస్థాయిలో వార్డుల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, ఇంజినీరింగ్ విభాగాల్లో సిబ్బంది కొరత వేధిస్తోందని.. మరి రికార్డుల్లో ఉన్న 273 మంది ఎక్కడ ఉన్నారని నిలదీశారు. బయోమెట్రిక్ హాజరు లేకుండా, కనీసం ముఖమైనా చూపని 'అదృశ్య' ఉద్యోగులకు ఏ ప్రాతిపదికన బిల్లులు పాస్ చేస్తున్నారని నిలదీయడంతో అధికారులు నీళ్లు నమలాల్సి వచ్చింది.

**30 మంది ఉద్వాసన.. ఆ పాపం ఎవరిది? ఆ సొమ్మెవరిది?**

విపక్షాల దాడికి తలొగ్గిన మున్సిపల్ కమిషనర్.. విధులకు హాజరుకాని 30 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించినట్లు సభలో ప్రకటించారు. అయితే ఈ ప్రకటన మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీని అంగీకరించినట్లయింది. విధులకు రానిది వాస్తవమే అయితే.. ఇన్నాళ్లూ వారి పేరిట డ్రా చేసిన లక్షలాది రూపాయల ప్రజాధనం ఏ నేతల ఖాతాల్లోకి వెళ్లింది? బయోమెట్రిక్ లేకుండానే హాజరు పట్టికలను ధృవీకరించి, వేతనాల బిల్లులపై సంతకాలు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు పట్టణంలో దావానలంలా రేగుతున్నాయి.

**లెక్కల మాయాజాలం.. తగ్గని బడ్జెట్ అంచనాలు!**

మున్సిపాలిటీ బడ్జెట్ అంచనాలు సైతం ఈ అక్రమాలకు అద్దం పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి అవుట్‌సోర్సింగ్ వేతనాల అంచనా వ్యయం రూ.6.50 కోట్లు కాగా, జనవరి ఆఖరి నాటికి ఖర్చయింది రూ.4.76 కోట్లే. మిగిలిన రెండు నెలల వేతనాలు కలిపినా మొత్తం వ్యయం రూ.5.68 కోట్లకు మించదు. ఒకవైపు 30 మంది సిబ్బందిని తొలగించామని చెబుతూనే.. మళ్లీ రూ.6.50 కోట్ల భారీ అంచనాను ప్రతిపాదించడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఈ లెక్కల మాయాజాలం వెనుక ఎంత పెద్ద తిమింగలాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏసీబీ విచారణ జరపాల్సిందే!**.. గద్వాల పురపాలక సంఘంలో జరిగిన ఈ దోపిడీ కేవలం నియామకాల సమస్య కాదు.. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన ఆర్థిక నేరం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామక పత్రాలు, వారి బయోమెట్రిక్ హాజరు, వేతనాలు జమయిన బ్యాంకు ఖాతాల వివరాలపై ఉన్నత స్థాయి లేదా ఏసీబీ విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# 38 మందికి మరణశిక్ష

మొదటి పేజీ తరువాయి

2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఈ కేసులో 77 మందిపై అభియోగాలు : ఈ కేసులో అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్, గుజరాత్ ఏటీఎస్, ఇతర దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా దర్యాప్తు నిర్వహించాయి. గుజరాత్‌తో సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అనుమానితులను అరెస్టు చేశారు. సాక్షుల ఆధారంగా మొత్తం కుట్రను ఛేదించినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి. ఈ కేసులో మొత్తం 77 మంది నిందితులపై అభియోగాలు మోపారు. సుదీర్ఘ విచారణ అనంతరం, 2022 ఫిబ్రవరి 8న అహ్మదాబాద్‌లోని ప్రత్యేక న్యాయస్థానం 49 మంది నిందితులను దోషులుగా నిర్ధారించగా, సాక్ష్యాధారాలు లేకపోవడంతో 28 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. మరోవైపు, న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి ఎక్స్‌లో స్పందించారు. బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించిందన్నారు. ఈ కేసులో దాదాపు నిందితులందరికి శిక్ష ఖరారైందని చెప్పారు. చివర్లో జై హింద్ అంటూ ముగించారు.

గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు : 2008 నాటి అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో 38 మంది దోషులకు గతంలో ప్రత్యేక న్యాయస్థానం విధించిన మరణశిక్షను, మరో 11 మందికి విధించిన



జీవిత ఖైదును కోర్టు సమర్థించింది. జస్టిస్ ఎ.వై. కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అన్ని అప్పీళ్లను తోసిపుచ్చింది. నిషేధిత ఉగ్రవాద సంస్థ 'ఇండియన్ ముజాహిదీన్' సభ్యులకు ప్రత్యేక కోర్టు విధించిన శిక్షలను ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. అలాగే, నిందితుల అప్పీళ్లన్నింటినీ హైకోర్టు తిరస్కరించింది. దీనితో పాటు, మృతుల బంధువులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష పరిహారం ఇవ్వాలని పేర్కొంది.

మరో 11 మందికి జీవిత ఖైదు : 2008 జులై 26వ తేదీ సాయంత్రం, సుమారు 45 నిమిషాల వ్యవధిలో అహ్మదాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఒకదాని తర్వాత ఒకటిగా 21 బాంబులు పేలాయి. మణి నగర్, ఇసాన్‌పూర్, నరోడా, బాపునగర్, సర్ఖేజ్, హత్కేశ్వర్ వంటి రద్దీ ప్రాంతాలను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. నగరంలోని బస్సులు, బహిరంగ ప్రదేశాలు, మార్కెట్లలో బాంబులు అమర్చారు. అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్, ఎల్.జీ. హాస్పిటల్‌ను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. మొదటి పేలుడులో గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మరో పేలుడు సంభవించింది. ఈ దాడిలో మొత్తం 56 మంది మరణించగా 200 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఉగ్రవాద దాడిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు 2022లో కీలక తీర్పును ప్రకటించింది. భారత న్యాయ చరిత్రలోనే అత్యధికంగా ఒకే కేసులో 38 మంది ఉగ్రవాదులకు ఉరిశిక్ష విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. మిగిలిన 11 మందికి జీవితకాలం జైలు శిక్ష విధించింది. చట్టప్రకారం దిగువ కోర్టు విధించిన మరణశిక్ష అమలు కావాలంటే హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి అవుతుంది. ఈ నేపథ్యంలో దాదాపు రెండేళ్లకు పైగా విచారణ జరిపిన గుజరాత్ హైకోర్టు, తాజాగా ఆ శిక్షలను ఖరారు చేస్తూ తుది తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా 2008 అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసుపై ప్రభుత్వ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడారు. "స్పెషల్ కోర్టు 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధించింది. గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ అప్పీళ్లను కొట్టివేసి, శిక్షల ధ్రువీకరణ పిటిషన్‌ను ఆమోదించింది. పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తీవ్రమైన గాయాలపాలైన వారికి రూ. 5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారం అందించాలని కూడా పేర్కొందని తెలిపారు.

# పరిపాలనలో మరింత పారదర్శకత

మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా చెప్పారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్ఠంగా 5వ తేదీలోగా పారదర్శకంగా




జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సూచించారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ , ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్మన్ శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంత్రికి సమాచారమివ్వడా..? : కొండా సురేఖ

**హైదరాబాద్, జులై 7 (వుదయం ప్రతినిధి) :** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, దేవాదాయశాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించడం పై దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కడయం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలు, మంత్రిగా తన అధికార పరిధిని బేఖాతరు చేశారని మంత్రి సురేఖ లేఖలో పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదు లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ తదితర అంశాలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ, శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్ తో పాటు శాఖ అధికారులను సమావేశపరచి పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని, నిబంధనల స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. శాఖా పరిపాలనకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుందనే విషయం ప్రజా జీవితంలో అనుభవజ్ఞులైన ప్రతి ప్రజాప్రతినిధికి విదితమేనని, అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి అధికారిక సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరణ కోరడంతో పాటు, పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి తన ఫిర్యాదులో కోరారు.

# బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ

మొదటి పేజీ తరువాయి

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూలై 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే అధ్యాపకుల హక్కుల సాధన

**- 19వ ఆవిర్భావ వేడుకల్లో ప్రభుత్వానికి వాగ్దానాల అమలు చేయాలని విజ్ఞప్తి**

**ముషీరాబాద్, జూలై 07 (వుదయం)**



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (TLF) తన 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని ద్విదశాబ్ది ఉత్సవాల ప్రారంభ సభగా ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ అధ్యాపకుల హక్కుల పరిరక్షణ, ఉద్యమ శక్తుల పునరేకీకరణకు కట్టుబడి పనిచేస్తామని రాష్ట్ర నాయకత్వం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డా. అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, BSMAT రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ రెడ్డి, DOTS అధ్యక్షుడు డా. సురేష్ చంద్ర హరి ముఖ్య అతిథులుగా హాజరై తెలంగాణ ఉద్యమ విలువలను కాపాడాల్సిన అవసరాన్ని వివరించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 19 సంవత్సరాలుగా TLF తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రైవేట్ అధ్యాపకులకు సముచిత వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం కల్పించడంలో సంస్థ విశేష కృషి చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమ స్ఫూర్తి ఏమాత్రం తగ్గలేదని, "లక్ష ఉద్యోగాల లడాయి", "చైతన్య బస్సు యాత్ర" వంటి ఉద్యమాల ద్వారా ప్రైవేట్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఉద్యమ సమయంలో సాధించిన హక్కులను పరిరక్షించడంలో విఫలమయ్యాయని, ప్రైవేట్ అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ప్రైవేట్ అధ్యాపకులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని TLF రాష్ట్ర శాఖ విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా TLF చైర్మన్ డా. కత్తి వెంకటస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య నేతృత్వంలో ద్విదశాబ్ది ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి, మాజీ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సి. భాస్కరరావును కమిటీ చైర్మన్‌గా నియమించారు. నేటి నుంచి 2027 జూలై 7 వరకు ద్విదశాబ్ది ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన, అధ్యాపకుల హక్కుల పరిరక్షణ, ఉద్యమ శక్తుల ఐక్యత కోసం TLF నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది.

## వర్షా కాలం: ప్రజలకు అప్రమత్తత పిలుపు

**గండిపేట్ జులై 07(వుదయం)**



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.గండిపేట్ మండలంలో మాట్లాడుతూ వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగించినప్పటికీ నిర్లక్ష్యం ప్రాణాపాయ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందన్నారు.ప్రతి కుటుంబం వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు.గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని చెప్పారు.వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు చేపట్టే పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి ఇంట్లో అవగాహన పెరిగితేనే వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రజలందరూ జాగ్రత్తలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన కోరారు.వర్షాకాలంలో దోమల సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని సర్వేష్ ముదిరాజ్ తెలిపారు.చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.పిల్లలు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా చూడాలని, ఇంటి చుట్టుపక్కల దోమలు పెరిగే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.సాయంత్రం సమయంలో పిల్లలను దోమల నుంచి రక్షించే చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని అన్నారు. జ్వరం, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని చెప్పారు.ఇంటి పరిసరాల్లో శుభ్రత పాటించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తుంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.వర్షాల కారణంగా రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో గుంతలు కనిపించకుండా ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముందని ఆయన హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు, కార్ల డ్రైవర్లు, పాదచారులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.రాత్రి సమయంలో మరింత జాగ్రత్త అవసరమని, నీటితో నిండిన ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా నడపాలని కోరారు.అత్యవసర పరిస్థితులు మినహా అనవసర ప్రయాణాలను తగ్గించడం మంచిదని అభిప్రాయపడ్డారు.వర్షపు నీటి కారణంగా విద్యుత్ తీగలు, తెరిచి ఉన్న మాన్‌హోల్స్ వంటి ప్రమాదకర పరిస్థితులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు.ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని ఆయన కోరారు.ప్రైవేట్ పాఠశాల బస్సుల డ్రైవర్లు విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని సర్వేష్ ముదిరాజ్ సూచించారు.వర్షపు సమయంలో రోడ్ల పరిస్థితిని పూర్తిగా గమనిస్తూ బస్సులు నడపాలని చెప్పారు.అధిక వేగం, నిర్లక్ష్య వైపర్లు, లైట్లు వంటి భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ప్రతిరోజూ పరిశీలించాలని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.పిల్లల ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని, అందరూ బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు.ప్రతి ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా చూసుకోవడం ప్రతి కుటుంబ బాధ్యత అని సర్వేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, సంచులు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని సూచించారు.కాలువలు మూసుకుపోకుండా పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ వంటి చర్యలకు స్థానిక సంస్థలు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో అప్రమత్తత, పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు, ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ప్రతి కుటుంబం ఈ సూచనలను పాటించి సురక్షితమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు

## బాచుపల్లిలో హేత్విక్ హీరో షోరూం ప్రారంభం



**కుత్బుల్లాపూర్, జులై 7,(వుదయం ప్రతినిధి )**

నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి లో మహేష్ గౌడ్, సాయి వంశీ, ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హేత్విక్ హీరో షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీశైలం గౌడ్, శేర్లింగం పల్లి ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్, నిజాంపేట్ మాజీ ఉప సర్పంచ్, ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని హేత్విక్ హీరో షోరూం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇందిరా , డివిజన్ సీనియర్ నాయకులు కిరణ్, నాగిరెడ్డి, అశోక్, రమణ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్‌కు రామచంద్రపురం సమస్యల వినతి

**రామచంద్రాపురం, జూలై 7(వుదయం)**



రామచంద్రపురం డివిజన్‌లో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీజనను కలిసి సమస్యలు వివరించగా, జోనల్ కమిషనర్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను అత్యవసరంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ సూచించిన ప్రాంతాలను వెంటనే సందర్శించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైన నిధుల మంజూరు విషయమై కమిషనర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పుష్పనగేష్ తెలిపారు.

## మైత్రి ల్యాబ్స్ కార్మికుడి మృతి

**- సీఐటీయూ చొరవతో కుటుంబానికి రూ.80 లక్షల పరిహారం.. యాజమాన్యం చెక్కు అందజేత**

**గుమ్మడిదల, జూలై 7 (వుదయం):**



గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని మైత్రి ల్యాబ్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ల్యాబ్ ఫ్యూమ్స్ పీల్చుకోవడంతో అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే పరిశ్రమ యాజమాన్యం అతడిని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించింది. పరిస్థితి విషమించడంతో అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనపై సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే. రాజయ్య ప్రత్యేక చొరవ తీసుకుని పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతుడి కుటుంబానికి రూ.80 లక్షల నష్టపరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, మృతుడి తల్లికి పెన్షన్ కల్పించాలని కోరారు. దీనికి యాజమాన్యం అంగీకరించింది.అనంతరం సీఐటీయూ నాయకులు కే. రాజయ్య, నాగభూషణం, కమ్మరి రవీందర్ చారి, శ్రీధర్ రావు సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు సీహెచ్. నాగ రాకేష్, ఏకే. రాంప్రసాద్, ఎన్. శ్రీనివాసరావు, పి. కుమార్, ఇ. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. బాలకృష్ణ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.80 లక్షల పరిహార చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి గడ్డమీది నిర్మల, సోదరి గడ్డమీది మౌనికతో పాటు కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ




**గుమ్మడిదల, జూలై 7(వుదయం):**

గుమ్మడిదల బస్టాండ్ చౌరస్తాలో మంగళవారం ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గుమ్మడిదల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పోతురాజు నవీన్ ఆధ్వర్యంలో ఉదయం 11.30 గంటల నుంచి 11.45 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘ ఐక్యత, సామాజిక న్యాయం కోసం ఉద్యమ లక్ష్యాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కానుకుంట గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తుడుం శ్రీను, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పోతురాజు పోచయ్య, సీనియర్ నాయకులు గుండగళ్ల వెంకటేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సుమారు 18 మంది హాజరయ్యారు.

## తెలంగాణ ఉద్యమకారుడు ఎస్. శివ ప్రకాష్‌కు ప్రశంసా పత్రం అందజేత

**- ఉద్యమ సేవలకు గుర్తింపుగా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘన సన్మానం**

**శంకర్‌పల్లి, జూలై 07 (వుదయం)**



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు ఎస్. శివ ప్రకాష్‌కు ఘన సన్మానం నిర్వహించారు.సంఘం అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రశంసా పత్రాన్ని అందజేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో చేసిన సేవలను గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉద్యమకారుల సేవలను సమాజానికి తెలియజేయడం, వారి త్యాగాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.ఉద్యమ స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రశంసా పత్రం అందుకున్న అనంతరం ఎస్.శివ ప్రకాష్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుడిగా తన సేవలను గుర్తించి సన్మానించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.ఈ గుర్తింపు తనకు మరింత బాధ్యతను పెంచిందని, ఉద్యమకారుల సంక్షేమం కోసం భవిష్యత్తులో కూడా తన వంతు కృషిని కొనసాగిస్తానని తెలిపారు.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణతో పాటు సంఘం నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గురు రాకేష్, సాయినాథ్ రాజ్, రాజేష్‌తో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు, సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, శివ ప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలువురు ఉద్యమ సహచరులు అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో విశేష కృషి చేసిన ప్రతి ఉద్యమకారుడికి తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టే ఇటువంటి సన్మాన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతాయని తెలిపారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి



**-10న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతులు**

**హైదరాబాద్ వుదయం ప్రతినిధి జూలై 07:**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు"అనే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50% చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని త్వం, ఆర్టీసీ సంస్థ...కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు.ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఘనంగా కోలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బాచుపల్లి, జులై 7,(వుదయం ప్రతినిధి ),**

నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ప్రగతి నగర్ (276) డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు అందరూ పెద్ద ఎత్తున హాజరై కేక్ కటింగ్ చేసి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ చిట్ల దివాకర్, బండారు లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటపాటి మురళి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు రఫియా బేగం, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, జి.మల్లికార్జున్, సందీప్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి, రాంచందర్ నాయక్, ప్రవీణ్ కుమార్, శేఖర్, మహేష్, వాజీద్, రహేమాన్, సంతోష్ గౌడ్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.338 కోట్లతో నూతన రహదారులు

**రంగారెడ్డి జిల్లా**

రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో నాలుగు లేన్ల ఆధునిక రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (HAM) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు

ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TUFIDC) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో "డైలీ షటిల్స్" సేవలకు ఘన ప్రారంభం




ఐటీ ఉద్యోగుల రోజువారీ ప్రయాణాన్ని సులభతరం చేసే వినూత్న రవాణా సేవ హైదరాబాద్, జూలై 7: నగరంలో ఐటీ కంపెనీల ఉద్యోగుల రోజువారీ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, సుద్‌లోని JRC కన్వెన్షన్లో ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ హాజరై సేవలను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ శ్రీ మధు యాష్కీ గౌడ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రవాణా, రోడ్లు & భవనాల శాఖ) శ్రీ వికాస్ రాజ్, IAS, తెలంగాణ రవాణా కమిషనర్ శ్రీ కె. ఇలంబరితి, IAS, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. రమేష్, IPS, అదనపు రవాణా కమిషతమైన సీటింగ్, డిజిటల్ బుకింగ్ వంటి ప్రత్యేకతలతో ఉద్యోగులకు నాణ్యమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు.పర్యావరణ హితమైన, స్మార్ట్ నగర రవాణా వ్యవస్థ అభివృద్ధికి డైలీ షటిల్స్ ఒక కొత్త అడుగుగా నిలుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభినందించారు.

**IN THE COURT OF 24 th ADDL.CHIEF JUDGE -CUM- MACT, CITY CIVIL COURTS. At: Chatta Bazar, Hyderabad.**
**MVOP No. 1897 of2025**
***Between:***
Ramesh Gadekadi, **Petitioner/s.**
**AND**
**Sattar Abdul,** & Anothers. **.Respondent/s.**
**To,**
**Sattar Abdul, S/o:Gaffar Abdul, Age:Major,Occ: Business, R/o:2-1-99/98, Bokkalguda, Adilabad-504001**
Take this Notice that the petitioner herein has filed the above M.V.O.P. against you and another respondent by claiming compensation before the above mentioned Court. Hence the above M.V.O.P. is posted for your appearance and counter. If you fail to appear before the above mentioned Court on 14-07-2026 by 10.30 a.m., the matter will be decided in your absence.
***(BY ORDER OF THE COURT)***
Sd/-
**PUTTA THIRUPATHI REDDY (AP/52/1996) MA (Eco), LLM (Con)**
**ADVOCATE**
**Flat No:1, Ravi Residency Apartment, H.No:13-4-48/F/1, Opp:Central Bank of India, left side to Rajadhani Theater, Vikas Nagar, Dilsukh Nagar, Hydrabad (Town & Dist.) Telangana (State), PIN:500060.**
**Phone: 9440687160.**
**Mail id: putta.thirupathireddy@gmail.com**




"అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు కొనసాగుతున్న వేళ.. శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ నోరువిప్పారు. తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారం. ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తాను. రామ మందిరంలో విరాళాల లెక్కింపు సమయంలో చోరీ జరిగిందని జూన్ 6వ తేదీ నుంచి ఎన్నో వదంతులు, చర్చలు జరుగుతున్నాయి. వ్యక్తిగతంగా పైనా ఎంతోమంది నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటిపై దర్యాప్తు జరుగుతున్నందున ప్రస్తుతానికి మౌనంగా ఉండాలని నిశ్చయించుకున్నా.. 'సిట్' తుది నివేదిక సమర్పించిన తర్వాతే ఒక్కో అంశంపై స్పందిస్తా.. అప్పుడు వాస్తవాలన్నీ బయటపడతాయి. 1991 నుంచి అక్కడే పని చేస్తున్నాను. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రచారక్‌గా సేవలందిస్తున్నా.."

- శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్

## వే'మన'పద్యం

కులములోన నొకడు గుణవంతుడుండిన
కులము వెలయు వాని గుణముచేత
వెలయు వనములోన మలయజమున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ.



# నిబద్ధత కలిగిన నేత జ్యోతిబసు

భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యో ద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలితరం నాయకులు, మొదటి పొలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచిన



నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్ లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్ ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు... నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళాశాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవహర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్ గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూనియన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసన సభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వం లోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగాల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహరించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 1 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.



సంగనబట్ల
9440595494

# భావాల బాటలో బతుకు సంతకం

కొన్ని ఊర్లు పటంలో కనిపించే చుక్కలు మాత్రమే. మరికొన్ని ఊర్లు అక్కడ పుట్టిన మనుషుల వల్ల జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి అలాంటి ఒక చారిత్రక, ఆత్మీయ నేల. పెద్ద పట్టణాల హడావుడి, కృత్రిమత్వం తెలియని ఆ పల్లె గాలిలో మట్టివాసన ఉంటుంది. మనుషుల మధ్య దూరాల కంటే ఆప్యాయతలు ఎక్కువగా కనిపిస్తాయి. ప్రకృతి తన సహజత్వాన్ని కోల్పోని అలాంటి నేలలో పుట్టిన అజీద్, జీవితాన్ని ముందుగా పుస్తకాలలో కాదు, మనుషుల ముఖాల్లో చదవడం నేర్చుకున్న వ్యక్తి. అందుకే ఆయన కలం అక్షరాలను కాకుండా, మనిషిని వెతుకుతుంది. కవి పుట్టడు; కాలమే అతన్ని తయారు చేస్తుందని చెబుతారు. ఆ మాటలో నిజం ఉంది. ప్రతి కాలం తన ప్రశ్నలకు జవాబు వెతుక్కుంటూ ఒక కవిని సృష్టిస్తుంది. కొందరు ఆ కాలాన్ని వర్ణిస్తారు, మరికొందరు దానిని ప్రశ్నిస్తారు. ఇంకొందరు కాలం గుండెల్లో దాగి ఉన్న నిశ్శబ్దాన్ని పలికిస్తారు. అజీద్ ఆ మూడో వరుసకు దగ్గరగా నిలిచే కవి. ఆయన అక్షరాలు పెద్దగా అరవవు, నినాదాలు చేయవు. కానీ చాలాసేపు మనసులో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. నిజమైన కవిత్వానికి ఒక విశిష్టమైన లక్షణం ఉంటుంది. అది పాఠకుడిని ఏదో ఊహాలోకంలోకి లాక్కెళ్లదు; పాఠకుడినే అతని స్వంత ప్రపంచానికి తిరిగి తీసుకెళ్తుంది. అజీద్ కవిత్వం చదివినప్పుడు మనం ఆయనను తెలుసుకోవడం కంటే, మనల్ని మనం ఎక్కువగా తెలుసుకుంటాం. ఒక మరిచిపోయిన జ్ఞాపకం, ఒక అనుకోని మౌనం, ఒక అర్థం కాని బాధ, ఒక కారణం లేని చిరునవ్వు – ఇవన్నీ ఆయన పదాల నీడలో మళ్లీ మన ముందుకు వచ్చి నిలబడతాయి. అదే ఆయన కవిత్వానికి ఉన్న అసలైన జీవశక్తి. అజీద్‌ను కేవలం ఒకే కోణంలో చూడడం ఆయన వ్యక్తిత్వానికి అన్యాయం చేసినట్టే అవుతుంది. మిత్రుడిగా ఆయన మనకు దగ్గరయ్యే తీరు, రచయితగా విషయాన్ని అర్థం చేసుకునే లోతు, సంపాదకుడిగా అక్షరాల పట్ల చూపే బాధ్యత, కవిగా మనిషి హృదయాన్ని తడిమే సున్నితత్వం – ఈ నాలుగు ప్రవాహాలు కలిసిన చోటే అజీద్ అనే వ్యక్తిత్వం సంపూర్ణమవుతుంది. ఇవి వేరువేరుగా ధరించిన ముసుగులు కావు; ఒకే అంతరంగానికి భిన్నమైన వ్యక్తీకరణలు. ప్రతి రచయిత తన భాషతో ఒక గుర్తింపును సంపాదిస్తాడు. కొందరి భాష ఆభరణాల్లా మెరుస్తుంది, కొందరి భాష ప్రవాహంలా సాగుతుంది. అజీద్ భాష మాత్రం మనిషిలా పలుకుతుంది. అది పాఠకుడిని ఆశ్చర్యపరచాలనే ప్రయత్నం చేయదు; అతని పక్కన కూర్చొని మాట్లాడుతుంది. అందుకే ఆయన వాక్యాల్లో కృత్రిమత కనిపించదు, అనుభవం నుంచి వచ్చిన నిజాయితీ మాత్రమే సాక్షాత్కరిస్తుంది. ఇప్పుడు సాహిత్యంలో ఒక ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోంది. భావాల కంటే భాషను, అనుభవాల కంటే అభినయాన్ని, నిజాయితీ కంటే ప్రదర్శనను ఎక్కువగా నమ్మే కాలమిది. అలాంటి సమయంలో అజీద్ అక్షరాలు మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తాయి – పదానికి అందం రావాలంటే ముందు మనసుకు స్వచ్ఛత రావాలని, వాక్యం నిలవాలంటే ముందు విలువ నిలవాలని. కవిత్వం అనేది కేవలం పదాలను పేర్చే నైపుణ్యం కాదని, మనిషిని అర్థం చేసుకునే ఒక నిరంతర సాధనమని ఆయన రచనలు మనకు నిరూపిస్తాయి. జీవితం గురించి పెద్ద పెద్ద సిద్ధాంతాలు, తత్వాలు చెప్పడం సులభం. కానీ ఒక సాధారణ మనిషి రోజువారీ పోరాటంలో దాగి ఉన్న అసాధారణ సౌందర్యాన్ని గుర్తించడం చాలా కష్టమైన పని. అజీద్ రచనలు ఆ కష్టమైన మార్గాన్నే ఎంచుకుంటాయి. అందుకే ఆయన అక్షరాల్లో గొప్పతనాన్ని ప్రత్యేకంగా వెతకాల్సిన అవసరం ఉండదు; ఆ సహజత్వమే గొప్పగా కనిపిస్తుంది. ఒక కవి తన కాలాన్ని ప్రేమించాలి, అదే సమయంలో ఆ కాలాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా కలిగి ఉండాలి. ఎందుకంటే ప్రశ్నించని కవిత్వం కేవలం అలంకారంగా మిగిలిపోతుంది. స్పందించని అక్షరం సాహిత్యం కాలేదు. అజీద్ రచనల్లోని సామాజిక స్పృహ ఈ అర్థంలో గమనించదగినది. ఆయన నిశ్శబ్దంగా మన ముందుంచే ప్రశ్నలు సమాజాన్ని ఆలోచింపజేస్తాయి. అది మనిషిని ఏ సిద్ధాంతపు గోడల మధ్య నిలబెట్టదు; గెలిచినవాడిగానో, ఓడిపోయినవాడిగానో కాక... జీవితం అనే దీర్ఘయాత్రలో నడుస్తున్న సాధారణ మనిషిగా చూస్తుంది. ఓటమిని అర్థం చేసుకునే ఓర్పు, బాధను వినగలిగే సహనం, ఆనందాన్ని పంచుకునే హృదయం ఇందులో కనిపిస్తాయి. ఈ డిజిటల్ కాలంలో మనిషి ఎన్నో సమాచారాల మధ్య జీవిస్తున్నాడు, కానీ తనను తాను వినడానికి సమయం కోల్పోతున్నాడు. అలాంటి సందర్భంలో కవిత్వం అతనికి అద్దంలా మారాలి. ఆ అద్దంలో ముఖం మాత్రమే కాదు, మనసు కూడా కనిపించాలి. అజీద్ కవిత్వం ఆ ప్రయత్నమే చేస్తుంది. మనలో దాచిపెట్టిన ప్రశ్నలను బయటకు తీసుకొస్తుంది. మరిచిపోయిన విలువలను మళ్లీ గుర్తుచేస్తుంది. తొందరపాటు జీవితంలో కాసేపు ఆగి మన చుట్టూ ఉన్న మనుషులను, మనలో ఉన్న మనిషిని చూసే అవకాశం కల్పిస్తుంది. రచయితగా ఆయన ప్రత్యేకత ఏదైనా ఉంటే, అది అనుభవాన్ని పదాలుగా మార్చడంలో కాదు; పదాలను అనుభవాలుగా మార్చడంలో ఉంది. ఒక మంచి వాక్యం చదివిన వెంటనే ముగిసిపోదు. అది మనలో ఆలోచనగా, జ్ఞాపకంగా, ప్రశ్నగా, కొన్నిసార్లు ఓదార్పుగా మారుతుంది. అజీద్ రచనలు అలాంటి అనుభూతిని మిగల్చగలవు. అందుకే వాటిని చదివిన తర్వాత పాఠకుడు కవితను కాదు, తన జీవితంలోని ఏదో ఒక క్షణాన్ని గుర్తు చేసుకుంటాడు. సంపాదకుడిగా కూడా ఆయన పాత్ర బహుధా ప్రశంసనీయం. గతంలో అనేక పత్రికలకు సంపాదకుడిగా చేసిన అనుభవంతో, ప్రస్తుతం 'నవ భూమి' దినపత్రికను స్థాపించి దానికి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఒక రచయిత తన రచనలకే బాధ్యత వహిస్తాడు, కానీ సంపాదకుడు అనేక రకాల కొత్త స్వరాలకు వేదికగా నిలుస్తాడు. కొత్త అక్షరాలను ప్రోత్సహించడం, భాషా ప్రమాణాలను కాపాడడం, సాహిత్య సంభాషణను సజీవంగా ఉంచడం – ఇవి కేవలం వృత్తిపరమైన బాధ్యతలు కావు, సాహిత్యం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనాలు. రచయితగా ఎదుగుతున్న ప్రతి మనిషిలోని సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం, సంభాషణను సజీవంగా ఉంచడం, మనుషుల మధ్య ఆత్మీయతను నిలబెట్టడం పుస్తకాలలో నేర్చుకునే లక్షణాలు కావు; అవి సంస్కారవంతమైన వ్యక్తిత్వం నుంచి పుడతాయి. అజీద్‌లో కనిపించే ఈ గుణం ఆయన అక్షరాలకు మరింత మానవీయతను, విశ్వసనీయతను జోడిస్తుంది.

సాహిత్య ప్రపంచం నిరంతరం మారుతోంది. కొత్త భావాలు వస్తున్నాయి, కొత్త భాషలు పుడుతున్నాయి. కానీ కాలం ఎంత మారినా మారని ఒకే ఒక్క విలువ 'నిజాయితీ'. ఆ నిజాయితీ ఉన్న రచనలు మాత్రమే పాఠకుడి గుండె చప్పుళ్లతో కలిసి ప్రయాణిస్తాయి. అజీద్ రచనా ప్రయాణం కూడా ఇదే విశ్వాసాన్ని బలపరుస్తుంది. పదాల కంటే మనిషిని, అలంకారాల కంటే అనుభూతిని నమ్మే రచనలకే చిరస్థాయితనం ఉంటుందని ఆయన అక్షరాలు చెబుతాయి. ఒక మంచి రచయిత తన పాఠకులకు కేవలం రచనలు మాత్రమే ఇవ్వడు; జీవితాన్ని చూసే మరో కోణాన్ని కూడా అందిస్తాడు. అజీద్ అక్షరాలు కూడా అదే పని చేస్తాయి. అవి జీవితాన్ని కృత్రిమంగా అందంగా చిత్రించవు; జీవితంలోని సహజమైన అందాన్ని గుర్తించమని ఆహ్వానిస్తాయి. బాధలో కూడా మనిషితనాన్ని కోల్పోవద్దని గుర్తుచేస్తాయి. అవి ఆశను ఉపదేశించవు, చీకటి మధ్య కూడా వెలుగును వెతకడం నేర్పిస్తాయి. గడ్డిపల్లి అనే చిన్న గ్రామం నుంచి బయలుదేరిన ఈ అక్షరయాత్రకు ఇంధనం పేరుప్రతిష్ఠలు కావు; చదివే మనిషి హృదయంలో మిగిలే స్పందన. జన్మదినం అనేది వయసుకు మరో సంఖ్య చేరిన రోజు మాత్రమే కాదు. ఇప్పటివరకు నడిచిన మార్గాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకునే సందర్భం; ఇంకా నడవాల్సిన దారిని మరింత విశ్వాసంతో ఆహ్వానించే క్షణం. ఈ శుభసందర్భంలో మిత్రుడు, కవి, రచయిత, సంపాదకుడు అజీద్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

గడ్డిపల్లి నేల మీకు ఇచ్చిన సహజత్వం, జీవితం మీకు నేర్పిన అనుభవం, అక్షరాలు మీకు అందించిన ఆత్మీయత – ఈ మూడూ ఎప్పటికీ మీ కలానికి వెలుగుగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. మీ పదాలు మరింత మంది పాఠకుల హృదయాల్లో నిలవాలి. మీ రచనలు కొత్త ఆలోచనలకు వేదిక కావాలి.

- యం.డి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ జర్నలిస్టు

# అలికిడి లేని హృదయాలు..!

*తల్లిదండ్రుల కళ్లల్లోని ప్రేమను చూస్తూ, వారి స్పర్శను పొందుతూ పెరగాల్సిన పిల్లలు నేడు మొబైల్ తెరల వెలుతురు లో పెరుగుతున్నారు. దీనివల్ల వారి మెదడు తీరు మారి పోతోంది. ప్రకృతిని చూసి, మనుషులతో మాట్లాడి నేర్చుకోవాల్సిన వయసులో, అల్గారిథమ్స్ ఇచ్చే కృత్రిమ ఉద్దీపనలకు బానిసలవుతున్నారు. ఫలితంగా వారిలో ఓర్పు నశి స్తోంది, చిన్న విషయాలకే హింసాత్మకంగా మారుతు న్నారు. సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో, భావోద్వేగాలను ఎలా సమతుల్యం చేసుకోవాలో తెలియని 'సామాజిక వికలాంగులుగా' మారే ప్రమాదం ముందుకొచ్చింది.*

నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతికత మానవ జీవితాన్ని ఎంతగానో సులభతరం చేసింది. మనిషి ప్రపంచవ్యాప్తంగా కనెక్ట్ అవుతూ ఏ మూలన ఉన్న సమాచారాన్నైనా క్షణాల్లో చేతుల్లోకి తెచ్చుకుంటున్నాడు. కానీ, దురదృష్టవశాత్తూ అదే స్థాయిలో స్థానికంగా, తన సొంత ఇంట్లోనే ఒంటరివాడైపోతున్నాడు. చేతిలోని స్మార్ట్‌ఫోన్ ప్రపంచాన్ని చుట్టేస్తోంది కానీ, పక్కనే కూర్చున్న మనిషి గుండె చప్పుడిని వినివ్వడం లేదు. ఆధునిక కుటుంబాలు నేడు ఒకే చిరునామాతో ఉన్న వేర్వేరు సైబర్ దీవులుగా మారిపోతున్నాయి. ఒకప్పుడు ఇళ్లల్లో గోడలు మాత్రమే మనుషులను విభజించేవి, నేడు ఐదు అంగుళాల తెరలు మనసులను వేరుచేస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ వ్యసనం అనేది కేవలం ఒక అలవాటు కాదు, అది మన హృదయాలను, మన బంధాలను, మన పిల్లల భవిష్యత్తును నిశ్శబ్దంగా తినేస్తోన్న ఒక సామాజిక మహమ్మారి. మనము ఫోన్ తెరను కిందికి మీదికి జరుపుతున్న ప్రతిసారీ.. మన బంధాల ఆయుష్షును కత్తిరిస్తున్నామనే పచ్చి నిజాన్ని అంగీకరించాలి. సామాజిక మాధ్యమాలలో ఎవరో తెలియని వ్యక్తి పెట్టే పోస్టులకు లైకులు కొట్టే చేతులు, పక్కనే కూర్చుని ఆకలి గురించో, అలసట గురించో చెప్పే భాగస్వామి భుజం తట్టడానికి రావడం లేదు. ఇళ్లల్లో సంభాషణలు పూర్తిగా చచ్చిపోయాయి. కేవలం 'కూరలో ఉప్పు లేదు', 'కరెంట్ బిల్లు కట్టాలి' లాంటి అవసరాల మాటలు తప్ప, మనసును తాకే ఆత్మీయ సంభాషణలు కరువవుతున్నాయి. దీనినే 'భావోద్వేగ గైర్హాజరు' అనవచ్చు. అంటే భౌతికంగా ఒకే గదిలో రూపమున్నా, మానసికంగా ఎవరి డిజిటల్ లోకాల్లో వారు విహరిస్తూ ఉంటారు. ఇది భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు – పిల్లల మధ్య ఒక అదృశ్య ఇనుప గోడను నిర్మిస్తోందనే చెప్పొచ్చు.



ఇప్పుడు పక్షపాతం అనేది కేవలం కులం, మతం, డబ్బు రూపంలోనే లేదు. అది 'శ్రద్ధ' రూపంలో కొత్త రూపు దాల్చింది. ఇళ్లల్లో నేడు 'డిజిటల్ వ్యత్యాసం' స్పష్టంగా కనిపిస్తోంది. ఒక చిన్నారి తన పాఠశాల చిత్రలేఖనాన్ని చూపించడానికి వస్తే, ఫోన్ వైపు చూస్తూ 'బాగుంది వెళ్లు' అనే ఒకే ఒక్క మాటతో ఆ బిడ్డ ఉత్సాహంపై తల్లిదండ్రులు చన్నీళ్లు చల్లుతున్న పరిస్థితి ఉందంటే కాదనగలమా..?. పిల్లల కంటే ఫోన్లకే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతుండటంతో, పిల్లలు తమ ఇళ్లలోనే 'రెండో తరగతి పౌరులుగా' మారిపోతున్నారు. అటు పాఠశాలలు కూడా పిల్లలను కేవలం ర్యాంకులు, గ్రేడులు, సాంకేతిక నైపుణ్యాల ఆధారంగానే అంచనా వేస్తూ కేవలం అంకెల కోణంలో నడుస్తున్నాయి. ఒక విద్యార్థి లోపల ఎంత ఒంటరితనంతో బాధపడుతున్నాడు, ఆ బాలుడు / బాలిక ఎందుకు నిశ్శబ్దంగా మారిపోతున్నాడు అనే మానసిక కోణాన్ని చదివే ఓపిక నేటి యాంత్రిక విద్యావ్యవస్థకు లేదు. తల్లిదండ్రుల కళ్లల్లోని ప్రేమను చూస్తూ, వారి స్పర్శను పొందుతూ పెరగాల్సిన పిల్లలు నేడు మొబైల్ తెరల వెలుతురులో పెరుగుతున్నారు. దీనివల్ల వారి మెదడు తీరు మారిపోతోంది. ప్రకృతిని చూసి, మనుషులతో మాట్లాడి నేర్చుకోవాల్సిన వయసులో, అల్గారిథమ్స్ ఇచ్చే కృత్రిమ ఉద్దీపనలకు బానిసలవుతున్నారు. ఫలితంగా వారిలో ఓర్పు నశిస్తోంది, చిన్న విషయాలకే హింసాత్మకంగా మారుతున్నారు. సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో, భావోద్వేగాలను ఎలా సమతుల్యం చేసుకోవాలో తెలియని 'సామాజిక వికలాంగులుగా' మారే ప్రమాదం ముందుకొచ్చింది.


ఈ డిజిటల్ చెరసాల నుండి బయటపడటానికి విప్లవాత్మకమైన అడుగులు అవసరం. అందుకోసం ప్రతి ఇంట్లోనూ 'వైఫై రహిత సమయాన్ని' అమలు చేయాలి. ముఖ్యంగా రాత్రి పూట భోజన సమయంలో ఇళ్లల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటాను పూర్తిగా ఆపేయాలి. ఆ సమయం కేవలం మనుషుల మాటలకే పరిమితం కావాలి. అవతలి వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు ఫోన్ వైపు చూడటం ఆపి, వారి కళ్లల్లోకి చూసి మాట్లాడే అలవాటును ఒక సామాజిక బాధ్యతగా మార్చుకోవాలి. అలాగే పాఠశాలల్లో వారానికి కనీసం ఒక్క రోజైనా పుస్తకాలు, కంప్యూటర్లు పక్కన పెట్టి విద్యార్థులు తమ మనసులోని భయాలను, ఆనందాలను పంచుకునేలా 'భావోద్వేగ తరగతులు' నిర్వహించాలి. సాంకేతికత మనల్ని మనుషులుగా మార్చాలి కానీ, యాంత్రిక రోబోలుగా కాదు. మనం లైక్ చేసే 'రీల్స్' మన నిజ జీవిత బంధాలను నిజంగానే బలితీసుకుంటున్నాయి. రేపు మన చేతిలో కోట్లాది మంది ఫాలోవర్స్ ఉన్నా, మనసు బాగోలేనప్పుడు ఓదార్చే మనిషి పక్కన లేకపోతే ఆ జీవితం శూన్యం. స్మార్ట్‌ఫోన్ లాకులను తెరవడం కాదు.. ముందు మన మనసుల లాకులను తెరుద్దాం. మనసు విప్పి మాట్లాడుకుందాం.. మనుషులను బ్రతికించుకుందాం..!



కస్తూరిదారా

# మరణం తీసుకెళ్ళింది స్వరాన్ని.. మనిషిని కాదు

కొన్ని మరణాలు మనకు తెలిసిన మనుషులను దూరం చేస్తాయి. కొన్ని మరణాలు మాత్రం మనకు పూర్తిగా తెలియని మనుషుల గురించి తెలుసుకోవాలని బలవంతం చేస్తాయి. అరుణోదయ నాగన్న మరణం నాకు రెండో రకంగా అనిపించింది. ఆయనతో నాకు వ్యక్తిగత పరిచయం లేదు. కానీ ఆయన మరణ వార్త చదివిన తర్వాత ఎందుకో నా మనసు ఆ వార్త దగ్గరే ఆగిపోయింది. మొదట నేను వెతికింది ఒక గాయకుడని. కానీ చదువుతున్న కొద్దీ ఒక నిజం నిమ్మదిగా తెరుచుకుంది. పాటలో వినిపించిన మనిషి తడిసిన కళ్ళల్లో అర్థమవుతూ వచ్చాడు. ఒక అపరిచితుడి కోసం మనసు ఎందుకు నిలబడుతుందో అర్థం కాలేదు. బహుశా కొందరు మనుషులు మన జీవితాల్లోకి పరిచయాల ద్వారా కాదు. విలువల ద్వారా ప్రవేశిస్తారేమో. ఆ వార్త తర్వాత నేను వెతికింది ఆయన పాటలను కాదు. ఆయన గురించి రాసిన మాటలను. పసునూరి రవీందర్, జిలకర శ్రీనివాస్, దామెర రాజేందర్, రమేష్ రాజా జ్ఞాపకాలలో, చెరుపల్లి ఆనంద్ మాటల్లో వెతుకుతుంటే ఒక్కో జ్ఞాపకం ఒక కిటికీలా తెరుచుకుంది. ఆ కిటికీ గుండా కనిపించింది ఒక గాయకుడి స్వరం కాదు.ఒక మనిషి నడక. వాళ్లు రాసింది ఒక గాయకుడి గురించి అనిపించినా, లోతుగా చూస్తే వాళ్లు వెతుకుతున్నది ఒక మనిషిని. ఒక్కో జ్ఞాపకం ఒక్కో కోణాన్ని చూపించినా, ఒక్కో వ్యక్తిగత తడిని నింపుకున్నా,వాటి మధ్య నుంచి ఆవిష్కృతమైంది ఒక మనిషి మనస్తత్వం. అప్పుడు అర్థమైంది కొన్ని జీవితాలు తమ గురించి తామే చెప్పుకోవు. వాటిని అర్థం చేసుకోవాలంటే వాటి స్వరాన్ని కాదు ప్రతి ధ్వని వినాలి. ఆ ప్రతిధ్వని మోసుకొచ్చే జ్ఞాపకాల స్పర్శ వాటి అసలు మనిషితనాన్ని మనకు పరిచయం చేస్తాయి. ప్రతి మనిషి రెండు జీవితాలు బతుకుతాడని అంటారు. ఒకటి తన శరీరంతో. ఇంకొకటి తన వల్ల తాకబడిన మనుషులలో. మొదటి జీవితం ఎప్పుడో ఒకరోజు ముగుస్తుంది. రెండో జీవితం మాత్రం జ్ఞాపకాలలో, విలువలలో,మనుషుల మాటలలో కొనసాగుతూనే ఉంటుంది. నాగన్నను గుర్తుచేసుకున్న వారి మాటల్లో నాకు దుఃఖం మాత్రమే వినిపించలేదు. ఆత్మీయ వెచ్చదనం కూడా కనిపించింది.అది ఒక మనిషి వెళ్ళిపోయిన బాధ మాత్రమే కాదు. ఒక విలువకు దూరమైన ఖాళీ. నాగన్న గురించి చదువుతున్న కొద్దీ ఆయనకు పాట అనేది కేవలం కళ కాదని అర్థమైంది. అది జీవితం గురించి మాట్లాడే పద్ధతి.పాటకు ఒక నిశ్శబ్దశక్తి ఉంటుంది. అది మనసును ఒప్పించదు. తాకుతుంది. సిద్ధాంతాన్ని వినిపించదు.అనుభూతిగా మారుస్తుంది.ఒక రైతు నిట్టూర్పుకు భాష దొరికితే అది పాట అవుతుంది. ఒక కూలి చెమటకు స్వరం దొరికితే అది పాట అవుతుంది. ఒక ప్రాంతం తన గౌరవం కోసం నిలబడితే అది కూడా చివరికి పాటగానే ప్రజల మధ్య నడుస్తుంది. నాగన్న స్వరం మోసుకువచ్చిన ఎన్నో పాటల్లో నాకు కనిపించింది ఇదే. అక్కడ ఒక ఉద్యమం ఉంది. ఒక ప్రాంతం ఉంది. ఒక వర్గం బాధ ఉంది. కానీ వాటన్నింటికంటే ఎక్కువగా ఒక మనిషి మీద ప్రేమ ఉంది. తెలంగాణ ఉద్యమంలోనూ, వాపక్ష ఉద్యమాల మధ్యనూ నాగన్న పాటలు కేవలం వినిపించలేదు. మనుషుల మధ్య తిరిగాయి. యోచన (సంచారి) రచించిన "చికాగో నగరాన"... వంటి గీతాలు ప్రజల జ్ఞాపకాలుగా మారిన ప్రయాణంలో నాగన్న స్వరం ఒక వాహకంగా నిలిచింది. అందుకే కొన్ని పాటలు రాసిన వారిని మాత్రమే కాదు,వాటిని ప్రజల మధ్యన జీవింపజేసిన స్వరాలను కూడా గుర్తు చేస్తుంటాయి. ఆయన గురించి చెప్పబడిన చిన్న చిన్న సంఘటనలు, మధ్య మధ్యలో మెరిసే జ్ఞాపకాలు, చెప్పలేక ఆగిపోయే మౌనాలు, ఒక్కోటి చేరుతుండగా ఒక ఉద్యమ గాయకుడు కంటే ఒక నిరాడంబరమైన



రూపమే ఎక్కువగా నిలిచింది. అందుకే ఆయనను కొందరు ఒక యోగిలా గుర్తు చేసుకుంటే మరికొందరు బైరాగి మనసున్న మనిషిగా చెబుతారు. అది లోకాన్ని వదిలేసిన వైరాగ్యం కాదు. తనకంటే పెద్దదైన ఒక ఆశయానికి అంకితమైన జీవితం. తన పేరు కంటే తన నమ్మకాలని పెద్దవిగా చూసిన స్వభావం. తన జ్ఞాపకాల మధ్య నడుస్తుంటే నన్ను ఎక్కువగా నిలిపేసిన ఆలోచన ఆయన చివరి నిర్ణయం.మనిషి జీవితంలో ఏమి చెప్పాడన్నది ఒక స్థాయి. కానీ తన మరణంలో కూడా అదే మాటను కొనసాగించగలిగితే అది మరో స్థాయి. తన దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశాడని తెలిసినప్పుడు అది ఒక వార్తలా వినిపించలేదు. ఒక తత్వంలా అనిపించింది. కొందరు జీవితాన్ని ఒక సందేశంగా మార్చుకుంటారు.కొందరు తమ మరణాన్ని కూడా ఆ సందేశంలో భాగం చేసి వెళతారు. నాగన్న అలాంటి వాళ్లలో ఒకరు. ఇప్పుడు నాగన్న తన స్వరాన్ని తనకోసం కాకుండా తన కాలం కోసం మలచిన ఒక మనిషిలా గుర్తుకు వస్తున్నాడు.కొన్ని పాటలు ముగుస్తాయి. కొన్ని స్వరాలు మౌనమవుతాయి. కానీ కొన్ని హృదయాలు కాలాన్ని దాటి వినిపిస్తూనే ఉంటాయి. ఇక్కడ మిగిలింది పాట కాదు. మనిషి జీవించిన సాక్ష్యం. ఇలాంటి మనుషుల విషయంలో కాలం జోడించినదెంత అతనిలో ముందే ఉన్నదెంత అన్నది విడదీయడం కష్టమవుతుంది. అందుకేనేమో ఈ వ్యాసం ముగిసే చోట కూడా ఆయన పూర్తిగా ముగియడు. ఎందుకంటే మరణం తీసుకెళ్లింది స్వరాన్ని మాత్రమే_మనిషిని కాదు.



ఆయిరబోయిన
బిక్షపతి
7993248717

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ప్రజారోగ్య సమస్యగా థైరాయిడ్ రుగ్మతలు

థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన రుగ్మతలు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ ప్రజలకు ఓ ప్రధాన సమస్యగా నిలుస్తున్నాయి. స్వర పేటికకు కింది భాగాన ఇరువైపుల చిన్న సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ గ్రంథి ప్రధాన విధుల్లో శక్తి సంబంధ జీవ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించడం, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, మానసిక ఆరోగ్యం, గుండె సక్రమంగా కొట్టుకోవడం, శరీర పెరుగుదలకు దోహదపడడం లాంటి ప్రధాన విధులు వస్తాయి. థైరాయిడ్ స్రవించే హార్మోన్ల మూలంగా శక్తి వినియోగ ప్రక్రియలు సక్రమంగా జరుగుతాయి. థైరాయిడ్ రుగ్మతల పట్ల సంపూర్ణ అవగాహన, ముందస్తు పరీక్షల నిర్వహణ, చికిత్స మార్గాల పరిజ్ఞానం, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించడానికి ప్రతి ఏట 25 మే రోజున "ప్రపంచ థైరాయిడ్ దినం" లేదా "వరల్డ్ థైరాయిడ్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. థైరాయిడ్ రుగ్మతల పట్ల సదస్సులు, ఉచిత థైరాయిడ్ క్యాంపులు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, థైరాయిడ్‌కు సంబంధించిన జాగ్రత్తలను వివరించడంతో వంటి పలు కార్యక్రమాలను ఈ వేదికగా చర్చిస్తారు. ప్రపంచ థైరాయిడ్ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "థైరాయిడ్ మరియు పోషకాహారం – అవగాహన అవసరం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. శరీరంలో థైరాయిడ్ హార్మోన్లు సాధారణం కన్న తక్కువగా లేదా ఎక్కువగా స్రవించడం వల్ల థైరాయిడ్ రుగ్మతలు జనిస్తాయి. శరీరంలో అయోడిన్ లోపంతో గాయిటర్, థైరాయిడిటిస్, థైరాయిడ్ వాపు, క్యాన్సర్ కారక ట్యూమర్లు, జెనెటిక్ కారణాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కలుగుతాయి. థైరాయిడ్ అతి చురుకుదనం వల్ల హైపర్ థైరాయిడిజమ్ రుగ్మత కలిగి చికాకు, అలసట, రుతుస్రావం తగ్గడం, మలబద్ధకం, చర్మం పొడిబారడం, కండరాల బలహీనత, చెమట పట్టడం, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. థైరాయిడ్ చురుకుదనం తగ్గినపుడు హైపోథైరాయిడిజమ్ రుగ్మత కలిగి బరువు మారడం, ఒత్తిడి, అధిక రుతుస్రావం, మెడ వాపు, అలసిపోవడం, బలహీనత, కండరాల నొప్పి, వెంట్రుకలు ఊడిపోవడం, పొడి చర్మం దురద, ఏకాగ్రత లోపం లాంటి లక్షణాలు కలుగుతాయి. థైరాయిడ్ రుగ్మతల భారం భారత్‌పై అధికంగా ఉండడం విచారకరం. మన దేశంలో దాదాపు 33 శాతం ప్రజలుగా రుగ్మతల వలయంలో చిక్కడం జరుగుతోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరికి హైపోథైరాయిడిజమ్ రుగ్మత నమోదు అవుతున్నది. అయోడిన్‌లోపం కారణంగా 200 మిలియన్ల భారతీయులు గాయిటర్ రోగం బారిన పడుతున్నారు. అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో బుద్ధి మాంద్యం కూడా కలుగుతోంది. గర్భవతుల్లో థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నం అయినపుడు తల్లికి, బిడ్డకు కూడా ప్రమాదం కావచ్చు. ఈ ప్రత్యేక సందర్భాల్లో నెలలు నిండకముందే ప్రసవాలు లేదా అబార్షన్ పద్ధతులను ఆశ్రయించాల్సి వస్తుంది.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం





## 'బ్రిడ్జిమ్యాన్' గిరీశ్ భరద్వాజ్ కన్నుమూత

- పద్మశ్రీ పురస్కారం అందుకున్న సామాజికవేత్త

**బెంగళూరు, జులై 6 (ఎ.ఎం.ఎస్):** ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత గిరీష్ భరద్వాజ్ (76) మరణించారు. దక్షిణ కన్నడ జిల్లాలోని సుల్లియాలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దేశవ్యాప్తంగా 140కి పైగా హ్యాంగింగ్ ఫుట్ బ్రిడ్జీలను నిర్మించడంతో ఆయనను 'బ్రిడ్జిమ్యాన్', 'సేతు బంధ్' అని పిలుస్తారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తక్కువ ఖర్చుతో, పర్యావరణ హితంగా హ్యాంగింగ్ వంతెనలను నిర్మించడంలో ఆయన పేరుగాంచారు. ఆయన నిర్మించిన 140 హ్యాంగింగ్ బ్రిడ్జీల్లో 120 బ్రిడ్జీలు గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఇతర ప్రాంతాలో అనుసంధానించేందుకు నిర్మించినవి కాగా, మిగిలినవి పర్యాటకం కోసం నిర్మించారు. ఆయన సేవలకు గాను డా.కోట శివరామా కరంత హత్తూరా ప్రశస్తి పురస్కారంతో పాటు భారత ప్రభుత్వం 2017లో 'పద్మశ్రీ'తో సత్కరించింది.




## 38 మందికి ఉరిశిక్ష ఖరారు
## గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు

- 2008 బాంబు పేలుళ్ల కేసుపై జడ్జిమెంట్

**గాంధీ నగర్, \జులై 6(ఎ.ఎం.ఎస్):** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ ఘోర ఉగ్రవాద దాడికి పాల్పడిన 38 మంది నిందితులకు కింది కోర్టు (ప్రత్యేక న్యాయస్థానం) విధించిన ఉరి శిక్షను హైకోర్టు ధర్మాసనం పూర్తిగా సమర్థిస్తూ ఖరారు చేసింది. అలాగే, మరో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను కోర్టు సమర్థించింది. భారత న్యాయ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో (38 మందికి) మరణశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.తీర్పుతో పాటు బాధితులకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఈ పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ.5 లక్షలు,సాధారణంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని గుజరాత్ ప్రభుత్వానికి సూచించింది. ఈ నష్టపరిహార ప్రక్రియ మొత్తాన్ని మార్చి 31, 2027 లోగా పూర్తి చేయాలని న్యాయస్థానం గడువు విధించింది.

జులై 26, 2008న గుజరాత్‌లోని ప్రముఖ వాణిజ్య నగరం అహ్మదాబాద్‌లో ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. కేవలం 70 నిమిషాల స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 21 ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లతో విరుచుకుపడ్డారు. రద్దీగా ఉండే మార్కెట్లు, బస్సులు మాత్రమే కాకుండా, మొదటి విడత పేలుళ్లలో గాయపడిన క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న సివిల్ హాస్పిటల్‌ను టార్గెట్ చేస్తూ ఉగ్రమూకలు రెండో విడత బాంబులు పేల్చడం గమనార్హం.

ఈ అమానవీయ ఘాతుకంలో 56 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, 246 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## దేశంలో తొలి 'లిక్విడ్ ట్రీ'



**అభివృద్ధి చేసిన సీఐఎంఎఫ్ఆర్**

**న్యూఢిల్లీ, జులై 6(ఎ.ఎం.ఎస్):** అత్యంత కాలుష్యపూరిత నగరాల్లో గాలిని శుభ్రపరిచేందుకు భారతదేశపు మొట్టమొదటి మొబైల్ 'లిక్విడ్ ట్రీ'ని సీఎస్ఐఆర్‌సీఐఎంఎఫ్ఆర్ సంస్థలు అభివృద్ధి చేశాయి. ఇది కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. కాంపాక్ట్ గాలిశుద్ధికరణ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు సీఎస్ఐఆర్‌సీఐఎంఎఫ్ఆర్ పరిశోధకులు ప్రకటించారు. ఈ పరికరం నిరంతరం $CO_2$ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. విద్యుత్తుతో పాటు సౌరశక్తితో పనిచేసేలా ఈ మొబైల్ యూనిట్‌ను రూపొందించారు.

**అత్యంత కాలుష్యపూరిత నగరాల్లో గాలిని శుభ్రపరిచేందుకు భారతదేశపు మొట్టమొదటి మొబైల్ 'లిక్విడ్‌ట్రీని సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్ సంస్థలు అభివృద్ధి చేశాయి. ఇది కార్బన్‌డైఆక్సైడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. కాంపాక్ట్ గాలి-శుద్ధీకరణ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్ పరిశోధకులు ప్రకటించారు. ఈ పరికరం నిరంతరం $CO_2$ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి.**

# దటీజ్ చైనా

- బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించిన డ్రాగన్ దేశం
- 1980 తర్వాత ఫసిపిక్ జలాల్లో ఇదే తొలిసారి

**బీజింగ్, జులై 6:** చైనా ఇటీవల న్యూక్లియర్ సబ్‌మెరైన్ నుంచి లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పరీక్షించింది. డమ్మీ వార్ హెడ్‌తో ఈ క్షిపణి ప్రయోగం చేపట్టినట్లు చైనాకు చెందిన జిన్హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. కేవలం భూమి మీది నుంచి మాత్రమే కాకుండా.. సముద్ర గర్భం నుంచి సైతం భూమ్మీద ఎక్కడైనా అణు దాడి చేయగల సామర్థ్యం తనకు ఉందని ఈ క్షిపణి ప్రయోగం ద్వారా చైనా ప్రపంచానికి చాటింది. దీంతో పసిఫిక్ మహాసముద్ర జలాల్లోకి చైనా చేపట్టిన అరుదైన ఈ ప్రయోగం అమెరికాతోపాటు దాని మిత్ర దేశాలను కలవరానికి గురి చేసింది. చైనా చివరగా రెండేళ్ల క్రితం పసిఫిక్ జలాల్లో ఓ డమ్మీ వార్ హెడ్‌తో మిస్సైల్ టెస్ట్ చేపట్టింది. 1980 తర్వాత చైనా పసిఫిక్ జలాల్లో క్షిపణి ప్రయోగం చేపట్టడం అదే తొలిసారి కావటం గమనార్హం. జులై 6న స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.01 గంటలకు చైనా నేవీ ఈ లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను పసిఫిక్ మహా సముద్రంలోని అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి పరీక్షించింది. ఈ క్షిపణి తన ప్రయాణాన్ని పూర్తి చేసిన తర్వాత దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని నిర్దేశిత ప్రాంతంలో సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని చైనా ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ జిన్హువా రిపోర్టు పేర్కొంది. చైనా సైన్యం వార్షిక శిక్షణలో భాగంగా ముందే నిర్ణయించిన ప్రకారం ఈ క్షిపణిని ప్రయోగించిందని.. ఇది ఏ దేశాన్ని లేదా సైనిక లక్ష్యాన్ని ఉద్దేశించి చేపట్టిన ప్రయోగం కాదని చైనా స్పష్టం చేసింది. చైనా దగ్గర ఉన్న అత్యాధునిక క్షిపణి అయిన జేఎల్3 సబ్‌మెరైన్ లాంచ్‌డ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ఈ క్షిపణి ప్రయోగంలో వాడి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత ఏడాది నిర్వహించిన మిలటరీ పరేడ్‌లో తొలిసారి ఈ క్షిపణిని డ్రాగన్ ప్రదర్శనకు ఉంచింది.

చైనా తీరంలోని సముద్ర జలాల నుంచి ప్రయోగించినా సరే అమెరికాను తాకే సామర్థ్యం ఈ ఖండాతర క్షిపణికి ఉంది. దీంతో చైనా చేపట్టిన ఈ క్షిపణి పరీక్ష పట్ల అమెరికాతోపాటు దాని మిత్ర దేశాలైన తైవాన్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. చైనా క్షిపణి పడిన ప్రాంతం 1985 నాటి రారాటోంగా ఒప్పందం ప్రకారం ఏర్పాటైన దక్షిణ పసిఫిక్ అణు రహిత ప్రాంతంలో ఉంది. ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతం చైనా చర్యల వల్ల భవిష్యత్తులో సైనిక పోటీకి వేదిక అవుతుందేమోనని అమెరికా




మిత్ర దేశాలు భయపడుతున్నాయి. అంతర్జాతీయ సమాజానికి చైనా ఇస్తున్న హెచ్చరికగా క్షిపణి పరీక్షను ఆ దేశాలు అభివర్ణించాయి.చైనా చేపట్టిన ఈ క్షిపణి ప్రయోగాన్ని నిశితంగా గమనించినట్లు అమెరికా పేర్కొంది. ఆయుధ నియంత్రణపై అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాల్సిందిగా తాము చైనాను కోరుతూనే ఉన్నామని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ తెలిపారు. చైనా వ్యూహాత్మక సైనిక సామర్థ్యాలను ఎంత వేగంగా పెంచుకుంటుంది అనడానికి ఈ క్షిపణి ప్రయోగం నిదర్శనమని అమెరికా అధికారులు రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక క్షిపణిని భూమి మీద నుంచి ప్రయోగించడంతో పోలిస్తే జలాంతర్గాముల నుంచి ప్రయోగించడం అనేది అడ్వాంటేజ్ అని చెప్పొచ్చు. ఎందుకంటే భూమి మీద ఎక్కడి నుంచి క్షిపణులను ప్రయోగిస్తారనే విషయమై నిఘా ద్వారా ఒక అంచనాకు రావచ్చు. కానీ సబ్‌మెరైన్లు నిరంతరం సముద్ర జలాల్లో కదులుతుంటాయి. అణుశక్తితో పని చేసే జలాంతర్గాములు అయితే చాలా కాలంపాటు సముద్ర గర్భంలోనే ఉంటూ గస్తీ నిర్వహించగలవు. మరోవైపు చైనా ఎప్పటికప్పుడు తన దగ్గరున్న అణ్వాయుధాలను పెంచుకుంటోంది. 2025లో అమెరికా కాంగ్రెస్‌కు పెంటగాన్ రిలీజ్ చేసిన రిపోర్టు ప్రకారం చైనా దగ్గర సుమారు 600 అణ్వస్త్రాలు ఉన్నాయి.

2030 నాటికి చైనా దగ్గర 1000కి పైగా అణ్వస్త్రాలు ఉండనున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

## ట్రంప్ మాటల మంటలు..

- అడ్డదిడ్డంగా అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు
- అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ యుద్ధం..?

ఖమేనీ అంత్యక్రియల ఘట్టం ముగిసిన వెంటనే అమెరికా మళ్లీ మాటల తూటాలు పేల్చింది. అంత్యక్రియల సమయంలోనే ట్రంప్ తన వ్యాఖ్యలతో ఇరాన్‌ను రెచ్చగొట్టారు, ఇరాన్ కూడా అదే స్థాయిలో ఘాటుగా సమాధానం చెప్పింది. అయితే, ట్రంప్ తాజాగా మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో అమెరికా ఇరాన్ మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు అలముకుంటాయా? అని అనిపిస్తోంది. ఇరాన్ అంశంపై మాట్లాడిన ట్రంప్ "మేం ఏదో ఒక విధంగా గెలుస్తాం. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటాం.. లేకపోతే పని పూర్తి చేస్తాం" అని అన్నారు. అయితే తాను యుద్ధం కంటే దౌత్యపరమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఇరాన్‌లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాలని తాను కోరుకోవడం లేదని.. ఇదే విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం కూడా గుర్తుంచుకోవాలని చెప్పారు. తాము అనుకుంటే గంటల వ్యవధిలోనే విధ్వంసం సృష్టిస్తామని హెచ్చరించారు.



"9.1 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడాలని నేను కోరుకోవడం లేదు. అందుకే ఒప్పందమే మంచిదని భావిస్తున్నాను. కానీ అవసరమైతే ఇరాన్‌లోని వంతెనలను గంటలోనే కూల్చేయగలం. వారి ఇంధన సరఫరా వ్యవస్థను, భారీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేసే సామర్థ్యం మాకు ఉంది, మధ్యాహ్నంలోపే ఇరాన్‌లోని అన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్వీర్యం చేయగలం. అది మాకు సాధ్యమని ఇరాన్‌కూ తెలుసు" అని ట్రంప్ హెచ్చరించారు. కొద్ది రోజుల క్రితం కూడా ట్రంప్ ఇరాన్ నాయకత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన ఇరాన్ అగ్రనేతలందరినీ ఒక్క దెబ్బతో అంతం చేయగలం అని వ్యాఖ్యానించారు. అయితే వెంటనే అలా చేస్తే చర్చలు జరపడానికి ఎవరూ మిగలరు. అందుకే అలా చేయడం లేదు అని చెప్పి, దౌత్య చర్చలకు అమెరికా ఇంకా అవకాశం ఇస్తోందని స్పష్టం చేశారు.

ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. అమెరికాకు నాగరికత, చరిత్ర, గౌరవం లేవని విమర్శించింది. వ్యక్తులను చంపవచ్చు.. కానీ వారి సిద్ధాంతాలను చంపలేరని.. ఖమేనీని హత్య చేసినా, ఆయన భావజాలాన్ని నిర్మూలించలేరు అని సమాధానం ఇచ్చింది. కాల్పులకు తాత్కాలిక బ్రేక్ ఇచ్చిన ఇరు దేశాలు.. చర్చలు విఫలమైతే మళ్లీ మిస్సైళ్ల వర్షం కురిపించుకోవడం ఖాయమనిపిస్తోంది.

## 4,800 మంది ఉద్యోగులకు షాక్..

- వారందర్నీ తొలగించిన మైక్రోసాఫ్ట్
- ఎక్స్‌బాక్స్‌పై తీవ్ర ప్రభావం

**వాషింగ్టన్, జులై 6:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ లేఆఫ్‌లు ప్రకటించింది. తమ సంస్థలో 4,800 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆ సంస్థ ఉద్యోగుల్లో ఇది 2.1 శాతం కావడం గమనార్హం. కృత్రిమ మేధ పెట్టుబడులు, వ్యయాలను తగ్గించుకోవడం మరింతగా దృష్టి సారిస్తుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెజాన్, మెటా వంటి దిగ్గజాలు కూడా ఈ ఏడాది వేలాది మంది ఉద్యోగులను సాగనంపాయి. అంతర్జాతీయ టెక్ దిగ్గజాల పెట్టుబడులు ఈ ఏడాది 700 బిలియన్ డాలర్ల దాటొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో లేఆఫ్‌లు ఉంటాయని రెండు నెలల కిందట మైక్రోసాఫ్ట్ సంకేతాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

తాజా, ఉద్యోగాల కోత మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం 'ఎక్స్‌బాక్స్'పై అధికంగా ఉంది. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చే విభాగాలపై తాము మరింత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అమీ కోల్‌మన్ పేర్కొన్నారు. ఈ భారీ కోతల వల్ల ఒక్క ఎక్స్‌బాక్స్ లోనే 1600కిపైగా ఉద్యోగులను తొలగిస్తామని సీఈఓ ఆశా శర్మ ఉద్యోగులకు పంపిన మెయిల్ వివరించారు. ఉద్యోగులకు పంపిన ఈమెయిల్‌లో,1,600 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు, మిగిలిన వారిని 2027 ఆర్థిక సంవత్సరంలో తొలగిస్తారని శర్మ పేర్కొన్నారు. దీనికి అదనంగా, ఎక్స్‌బాక్స్ తన నాలుగు గేమింగ్ స్టూడియోలను విక్రయించనుంది. మరొక దానితో కూడా సంబంధాలు తెంచుకోవడానికి సిద్ధమవుతోంది.

ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తూ, తన వ్యాపార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోడానికి ఈ సాంకేతికతను మైక్రోసాఫ్ట్ ఉపయోగిస్తోంది. దీంతో టెక్ రంగంలో జరుగుతున్న లేఆఫ్‌ల పరంపరలో ఇది తాజాది. 2026 మొదటి ఆరు నెలల్లో మైక్రోసాఫ్ట్ షేర్లు దాదాపు 23 శాతం పడిపోయి నేపథ్యంలో సోమవారం లేఆఫ్‌ల ప్రకటన వెలువడింది. 2022 తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు తొలి అర్థభాగంలో దారుణమైన పతనాన్ని చవిచూడటం ఇదే మొదటిసారి కావటం గమనార్హం. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికాలోని తన ఉద్యోగులలో సుమారు 7 శాతం మంది అంటే దాదాపు 9,000 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని (వాలంటరీ బైఅవుట్స్) మైక్రోసాఫ్ట్ అందించింది. కొత్త ఆర్థిక సంవత్సరానికి ఖర్చు ప్రణాళికలను నిర్దేశించుకునే క్రమంలో జూన్‌లో తన ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి ఉద్యోగాలను తగ్గిస్తుంది.

ఏఐకి పెరుగుతోన్న విపరీతమైన డిమాండ్ కారణంగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన అజూర్ క్లౌడ్ కంప్యూటింగ్ వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. గతేడాది ఏప్రిల్ వరకు ఓపెన్ ఏ.ఐ.మోడళ్లను విక్రయించే ప్రత్యేక హక్కులు అజూర్‌కే ఉన్నాయి. ఆ సేవల నిర్వహణకు డేటా సెంటర్లను నిర్మించడంలో ఖర్చు నానాటికీ పెరుగుతుండటంతో మైక్రోసాఫ్ట్ నగదు ప్రవాహంపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తోంది. ఈ నెల చివరలో అర్థ సంవత్సర ఫలితాలను ప్రకటించనున్న మైక్రోసాఫ్ట్.. గత ఏప్రిల్‌లోనే అజూర్ త్రైమాసిక విక్రయాలు వాల్ స్ట్రీట్ అంచనాల కంటే ఎక్కువగా ఉంటాయని అంచనా వేసింది. కానీ అదే సమయంలో 2026 ఏడాదికిగానూ ఏకంగా 190 బిలియన్ డాలర్లు (రూ. 15 లక్షల కోట్లకు పైగా) భారీ వ్యయ అంచనాను ప్రకటించి మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ భారీ వ్యయం విశ్లేషకుల అంచనాలను పూర్తిగా దాటేసింది.




**ప్రపంచ వ్యాప్తంగా ఆ సంస్థ ఉద్యోగుల్లో ఇది 2.1 శాతం కావడం గమనార్హం. కృత్రిమ మేధ పెట్టుబడులు, వ్యయాలను తగ్గించుకోవడం మరింతగా దృష్టి సారిస్తుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెజాన్, మెటా వంటి దిగ్గజాలు కూడా ఈ ఏడాది వేలాది మంది ఉద్యోగులను సాగనంపాయి. అంతర్జాతీయ టెక్ దిగ్గజాల పెట్టుబడులు ఈ ఏడాది 700 బిలియన్ డాలర్ల దాటొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో లేఆఫ్‌లు ఉంటాయని రెండు నెలల కిందట మైక్రోసాఫ్ట్ సంకేతాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.**



## ఇండోనేషియాలో ప్రధాని మోడీ

- ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

**జకార్తా, జులై 6:** మూడు దేశాల పర్యటనలో భాగంగా భారత ప్రధాని మోడీ సోమవారం రోజు ఇండోనేసియా రాజధాని జకార్తా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి మోడీకి స్వాగతం పలికారు. ఇండోనేసియా అధ్యక్షుడి ఆత్మీయ ఆతిథ్యానికి స్పందించిన ప్రధాని మోడీ..స్వయంగా ప్రబోవో తనను విమానాశ్రయానికి వచ్చి స్వాగతించడం ఎంతో హత్తుకుందని తెలిపారు. ఈ పర్యటనలో భారత్ ఇండోనేసియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలు చర్చలు జరగనున్నట్టు వెల్లడించారు.2018లో భారత్ ఇండోనేసియా సంబంధాల్ని సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాం. ఆ భాగస్వామ్యం రెండు దేశాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోంది' అని పోస్టులో పేర్కొన్నారు.


## ఫ్రాన్స్ అధ్యక్షుడికి తప్పిన ముప్పు



- ఆయన హోటల్ సమీపంలో బాంబు పేలుళ్లు

**సిరియా, జులై 6:** సిరియాలో భారీ బాంబ్ పేలుళ్లు సంభవించాయి. ఆ దేశ పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ బస చేసిన హోటల్ సమీపంలో ఈ పేలుళ్లు సంభవించడం కలకలం సృష్టించాయి.

దీంతో ఒక్కసారిగా భద్రతా దళాలు ఆందోళన చెందాయి. వెంటనే భద్రతా బలగాలు రహదారులను మూసివేసి, ఆ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. అయితే అధ్యక్షుడు మాక్రాన్ కాన్వాయ్‌కు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని అధికారులు స్పష్టం చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడి పర్యటనను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులు కూడా పేలుళ్లను ప్రత్యక్షంగా గుర్తించలేదని సమాచారం. అనంతరం సిరియా రాష్ట్ర టెలివిజన్.. మాక్రాన్‌అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా సిరియా అధ్యక్ష భవనంలో సమావేశమైనట్లు ధృవీకరించాయి.



## కారును అడ్డగించి మరీ దాడి..

**కర్నాటకలో సంచలనం సోషల్ మీడియాలో వైరల్**

**బెంగళూరు, జులై 6(ఎ.ఎం.ఎస్) :** భార్య, పిల్లలతో కారులో వెళ్తున్న వ్యక్తిని అడ్డుగించి మరీ కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరగలేదు. బెంగళూరు మైసూర్ ఎక్స్‌ప్రెస్ వేపై జరగడంతో సంచలనంగా మారింది. హైవేపై వస్తున్న సమయంలో మరో కారు డ్యాష్ క్యామ్‌లో ఈ ఘటన రికార్డు కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ వ్యక్తి తన భార్య, పిల్లలు, వృద్ధురాలితో కలిసి మారుతి సుజుకి ఆల్టో కారులో బెంగళూరుమైసూరు ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్నాడు. ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారి కారును అడ్డగించి నిలిపివేశారు. ఆ వెంటనే కొందరు వ్యక్తులు పరిగెత్తుకుంటూ వచ్చి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత వారు బలవంతంగా డ్రైవర్ డోర్ తెరిచి, కారులోనే ఉన్న వ్యక్తిపై దాడి చేసినట్లు వీడియోలో కనిపిస్తోంది.

హైవే మధ్యలోనే ఆపి పెద్ద గొడవ జరుగుతుండటంతో వెనుక వస్తున్న మరో వెహికల్‌లోని వ్యక్తి సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ ఆ వ్యక్తులు కారులో నుంచి డ్రైవర్‌ను బయటకు లాగి మరీ దాడి చేశారు. కారులో ఉన్న మహిళ కూడా కిందకి దిగి వారిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయినా కూడా వినకుండా దాడి చేశారు. ఈ సీన్ మొత్తం వెనుక ఉన్న కారులోని డ్యాష్ క్యామ్‌లో రికార్డయింది. ఈ ఘటనపై ఇప్పటి వరకు పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులను గుర్తించారా? ఎవర్నైనా అరెస్ట్ చేశారా? అనే విషయాలపై కూడా క్లారిటీ లేదు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా దర్యాప్తు చేపట్టే అవకాశం ఉందని నెటిజన్లు భావిస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. తాజాగా ఇలాంటి ఘటనే ఇటీవల హైదరాబాద్‌లోనూ చోటుచేసుకుంది. ఒక ఫ్యామిటీ హైవే మీద వెళ్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తూ అసభ్యంగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా చెప్పులతో కారుపై దాడి చేశారు.

ఆ సమయంలో కారులో మహిళలు, చిన్న పిల్లలు కూడా ఉన్నారు. వీడియో కారు డ్యాష్ క్యామ్‌లో రికార్డవడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేశారు.

**ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారి కారును అడ్డగించి నిలిపివేశారు. ఆ వెంటనే కొందరు వ్యక్తులు పరిగెత్తుకుంటూ వచ్చి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత వారు బలవంతంగా డ్రైవర్ డోర్ తెరిచి, కారులోనే ఉన్న వ్యక్తిపై దాడి చేసినట్లు వీడియోలో కనిపిస్తోంది. హైవే మధ్యలోనే ఆపి పెద్ద గొడవ జరుగుతుండటంతో వెనుక వస్తున్న మరో వెహికల్‌లోని వ్యక్తి సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ ఆ వ్యక్తులు కారులో నుంచి డ్రైవర్‌ను బయటకు లాగి మరీ దాడి చేశారు. ప్రయత్నం చేసింది.**

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రాజకీయ కక్షతో కాళేశ్వరం జలాలను ఆపుతున్నారు బిఆర్ఎస్ ఆరోపణ

### కలెక్టరేట్ ముట్టడించిన బిఆర్ఎస్ శ్రేణులు, రైతులు



**సూర్యాపేట జులై 7 వుదయం ప్రతినిధి**

కన్నెపల్లి పంప్ హౌస్ ను తక్షణమే ప్రారంభించి, ఎండిపోతున్న ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ శ్రేణులు, రైతులు మంగళవారం సూర్యాపేట ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ ఆందోళన చేపట్టారు.మాజీ మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ముఖ్య నాయకుల నేతృత్వంలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, రైతులు కలెక్టరేట్ ముందు బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. కరువు పొంచి ఉంది – ప్రభుత్వం మొండి వైఖరి ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు ప్రమాదం పొంచి ఉందని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా సకాలంలో నీరందించి రైతాంగాన్ని ఆదుకున్నామని గుర్తు చేశారు.రాజకీయ కక్షతోనే నీటిని ఆపుతున్నారు ప్రస్తుత ప్రభుత్వం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కన్నెపల్లి పంప్ హౌస్ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేస్తూ కాళేశ్వరం జలాలను ఆపాలని కుట్ర పన్నుతోందని తీవ్రంగా ఆరోపించారు.రైతుల పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని, కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ కావాలనే కాలయాపన చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని ధ్వజమెత్తారు.తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ ను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలిఆయకట్టుకు గోదావరి జలాలను విడుదల చేయాలి సాగునీటి విషయంలో రాజకీయం పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలికలెక్టరేట్ ముట్టడితో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణంనెలకొంది. అనంతరం బిఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రంసమర్పించారు.ప్రభుత్వం స్పందించి తక్షణమే గోదావరి జలాలను విడుదల చేయకుంటే, బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ జాతిపిత కేసీఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.పాల్గొన్నవారు: బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, జిల్లా, మండల స్థాయి నాయకులు, అధిక సంఖ్యలో రైతులు, కార్యకర్తలు.

## మునగాలపోలీస్_స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్




**మునగాల జూన్ 07 (వుదయం):**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ మంగళవారం రోజు ఉదయం మునగాల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో భాగంగా పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రిసెప్షన్ సెంటర్ ను తనిఖీ చేసి ఫిర్యాదుల నిర్వహణ, ఫిర్యాదులపై పోలీసు సేవలు, బాధితులతో పోలీసు వ్యవహరించి తీరు, రికార్డ్ నమోదు మొదలగు అంశాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి బాధితునికి భరోసా కల్పించే విధంగా రిసెప్షన్ సెంటర్ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డ్స్, కేసుల స్థితిగతులు, సాంకేతికత సద్వినియోగం, సీసీ కెమెరాలు నిర్వహణ, సమస్యాత్మక వ్యక్తుల రికార్డుల నిర్వహణ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. సిబ్బంది పనితీరు, సేవల్లో సామర్థ్యం అంశాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారి వెంట నిరంతరం గస్తీ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోలీసు సేవలో పనితీరును ప్రతి సిబ్బంది మెరుగుపరుచుకుని ఆధునిక పోలీస్ అనుసరిస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని, ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నామని అన్నారు. జాతీయ రహదారిపై రాత్రింబవళ్లు పోలీస్ శాఖ పెట్రోలింగ్ నిర్వహిస్తుందని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ శాఖ పూర్తిస్థాయి నిగా వచ్చిందని వీటికి పాల్పడే వారిని ఉపేక్షించమని అన్నారు.ఎస్పీ వెంట మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, ఏఎస్ఐ రత్నం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు పెంపొందించాలి — జిల్లా కలెక్టర్



**జనగామ, జూలై 07 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం లింగాల ఘనపురం మండలం నేలపోగుల గ్రామంలోని పీఎం శ్రీ ఎంపీయూపీఎస్ (MPUPS) పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యా బోధన, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ తరగతుల గదులను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు గణిత సమస్యలను ఇచ్చి స్వయంగా సాధింపజేశారు. గణితంలో ప్రాథమిక సూత్రాలపై, సంఖ్యా పరిజ్ఞానంపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.డిజిటల్ విద్య, కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు కేవలం మౌస్‌పైనే కాకుండా, కీబోర్డ్ ద్వారా MS Excel వాడటం నేర్చుకోవాలి. ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ బోధన సాగాలి.వసతుల పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టు, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి. క్లాస్ రూముల్లో ట్యూబ్ లైట్లు, అవసరమైన బెంచీలు, బ్లాక్ బోర్డులు అమర్చాలి.పరిశుభ్రత, పాఠశాల మైదానంలోని గడ్డి, పొదలను తొలగించి, మరుగుదొడ్లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.పాఠశాల విస్తరణ, భవిష్యత్ అవసరాల కోసం పాఠశాలపై మరో అంతస్తు నిర్మాణం, అలాగే దీనిని 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నర్సంపేట డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి, జూలై 7**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మంగళవారం నర్సంపేటడివిజన్ పరిధిలోని దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో పరిశీలించారు. అలాగే నర్సంపేట పట్టణంలోని 170వ పోలింగ్ కేంద్రం పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరుపై ఆరా తీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుని గుర్తించి, ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ఇంటింటి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. పరిశీలన సందర్భంగా గ్రామ రైతులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామాల్లో సాగవుతున్న పంటలు, పంటల విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, దుగ్గొండి తహసీల్దార్ సమ్మక్క, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి తదితర అధికారులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ కట్టుబడి ఉంది..

### ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్



**ఖమ్మం, వుదయం బ్యూరో జూలై -07**

వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణకు ఫుడ్ సేఫ్టీ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఇన్‌చార్జి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ తెలిపారు.ఖమ్మం నగరంలోని పిస్తా హౌస్ రెస్టారెంట్‌లో భోజనం చేసిన అనంతరం తన కుమార్తె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఒక వినియోగదారుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత రెస్టారెంట్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, వంటశాల నిర్వహణ, ఆహార భద్రత ప్రమాణాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో భాగంగా రెండు ఆహార పదార్థాల చట్టబద్ధ (Act) నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి ఈ. శరత్ మాట్లాడుతూ, ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటిలో తేలిన ఫలితాల ఆధారంగా ఆహార భద్రత ప్రమాణాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార వ్యాపార సంస్థలపై ఫుడ్ సేఫ్టీ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి విక్రయించడంతో పాటు, నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వినియోగదారులు ఆహారం తీసుకునే సమయంలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నాసిరకం, కలుషితమైన లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి రాజీ లేకుండా ఫుడ్ సేఫ్టీ శాఖ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి తర్వాత తల్లిలా ఆశా కార్యకర్తలు సేవలందించాలి

### ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ ఎం. మురళి



**చర్ల , జూలై 7:(వుదయం ప్రతినిధి)**

చర్ల మండలం పరిధిలోని కొయ్యూరు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించిన డిప్యూటీ కలెక్టర్ మురళి. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తల విధులు, సేవల తీరును పరిశీలించి పలు కీలక సూచనలు చేశారు. సమాజంలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో విలువైనదని తెలిపారు. "ఆశా కార్యకర్త అంటే తల్లి తర్వాత తల్లి లాంటిదని తెలిపారు. ముఖ్యంగా మొదటిసారి గర్భం దాల్చి ప్రసవించిన మహిళలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తూ, వారికి ఒక తల్లిలా అండగా నిలిచేది ఆశా కార్యకర్తలే" అని కొనియాడారు. ఆశా కార్యకర్తలు ధరించే తెల్లని దుస్తులు మదర్ థెరిస్సా సేవాస్ఫూర్తిని గుర్తు చేస్తున్నాయని పేర్కొంటూ, ప్రజలకు సేవ చేయడంలో ఎవరిపైనా కోపం ప్రదర్శించకుండా, ఓర్పుతో, మానవతా దృక్పథంతో ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. సమావేశం అనంతరం ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ ఆసుపత్రిలోని అన్నీ రికార్డు లను పరిశీలించారు, ఆసుపత్రి గదులు, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని వైద్య సిబ్బంది, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై BLAలతో సమీక్ష నిర్వహించిన భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా, 07 జూలై 2026**

ఈ రోజు పోచంపల్లి పట్టణంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై పట్టణ, మండల BLAలతో,నాయకులతో భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగకుండా BLAలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, చిరునామా మార్పుల ప్రక్రియలో ప్రజలకు సహకరించాలని కోరారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలకు ముందే ప్రతి బూత్‌ను పూర్తిగా పరిశీలించి, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హుడి ఓటును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పోచంపల్లి పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, BLAలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా సీత్లా పండుగ

**పెద్దవంగర, జులై 7 (వుదయం ప్రతినిధి):**

గిరిజనుల ఆరాధ్య దైవం సీత్లా భవానీ పండుగను మండల వ్యాప్తంగా గిరిజనులు మంగళవారం ఘనంగా నిర్వహించారు.గ్రామంలోనిగిరిజన యువతులు, మహిళలు, యువకులు సీత్లా భవానికి నైవేద్యం సమర్పించేందుకు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ గ్రామ పొలిమేరకు తరలివెళ్లారు. సీత్లా భవానికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రతిఏటా శ్రావణ మాసంలో వచ్చే పెద్ద పుష్యాల కార్తె మొదటి వారంలో ఈ పండుగను నిర్వహిస్తారు.

## నాణ్యమైన విద్య - అర్హులందరికీ ఓటు హక్కే లక్ష్యం:

### సుజాతనగర్‌లో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 7 (ప్రతినిధి):**

జిల్లాలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం సుజాతనగర్ మండలంలో పర్యటించిన ఆయన ప్రభుత్వ పాఠశాల పనితీరు, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించారు.ముందుగా సుజాతనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల హాజరు, బోధన విధానం, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా తనిఖీ చేసి, నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.అనంతరం రాఘవాపురం గ్రామంలో ఇంటింటా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు, ఓటర్లకు అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో మాట్లాడారు.గ్రామంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల సంఖ్య, విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోల వివరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అధికారులు స్పందిస్తూ గ్రామంలో ఇప్పటివరకు 1,400 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఫారాల సేకరణతో పాటు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్‌వోలు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దెందుకూరు పీఏసీఎస్‌లో కలెక్టర్ టీఎస్ దివాకర ఆకస్మిక తనిఖీ



**మధిర, జూలై 7, వుదయం, ప్రతినిధి:**

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎరువుల పంపిణీ, విత్తనాల సరఫరాలో పార ద ర్శక త నుప ర్యవేక్షించేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర టీ ఎస్ మంగళవారం దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్,గోదాములలో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఖరీఫ్ సాగుకు అత్యంత కీలకమైన సమయంలో రైతులకు ఎటువంటి కొరత రాకూడదని ఆయన స్పష్టం చేశారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యతపై అధికారులతో చర్చించిన ఆయన, నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని,బ్లాక్ మార్కెటింగ్‌కు ఏమాత్రం తావులేకుండా ప్రభుత్వ నిర్ణీత ధరలకే విక్రయాలు జరగాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా కలెక్టర్ స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సేవలు, విత్తనాల నాణ్యత,ఎరువుల పంపిణీపై రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేయడమే లక్ష్యంగా సొసైటీ పనిచేయాలి.రైతులు కార్యాలయానికి వచ్చినప్పుడు వారిని ఆదరించి, సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి అని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మధిర తహసిల్దార్ రాంబాబు మధిర ఏడీఏ వాణిశ్రీ, ఏఓ సాయి దీక్షిత్, పీఏసీఎస్ అధ్యక్షులు కోట వెంకట కృష్ణ, గ్రామ సర్పంచ్ పగిడిపల్లి శ్రీనివాసరావు, సొసైటీ సెక్రెటరీ నెలకుదుటి వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరా ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారు

### మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**జయశంకర్ భూపాలపల్లి జులై 07(వుదయం జిల్లా ప్రతినిధి)**

దేవుళ్లను పూజించే సామాజిక వర్గంలో జన్మించిన ఎమ్మెల్యే కుటుంబం దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనీ భీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జరిగిన ఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారని, అవి 2025పుష్కరాలకు సంబంధించినవని, అవి ఇక్కడ ఎలా పంచారని ఆయన ప్రశ్నించారు.దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయాన్ని పూర్తిగా అవినీతిమయం చేసిన అధికారి ఈ సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తన భర్త రాజకీయంలో వారి అవసరాల కోసం కాళేశ్వర ఆలయాన్ని వదిలిపెట్టడం లేదని ఇప్పటికే చెప్పామని ఆయన గుర్తు చేశారు. అధికారి వారితో పాటు వారి కుటుంబం ఎక్కడపడితే అక్కడ దోచుకు తింటాండ్లని వట్టిగనే చెప్తలేమని, ధన్వాడలో స్వయంగా అధికారి భర్త ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేసినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని మీడియా ముందు చూపించారు. 2025 పుష్కరాల్లో ఆలయం నుంచి డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన చీరలు, ప్రసాదం 50వేలు, వచ్చే పుష్కరాల్లో లక్ష కిట్లను పక్కకు పెట్టి వచ్చే ఎన్నికలకు వాడుకునే ఆలోచన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దొంగతనంగా తీసుకువచ్చిన చీరలు అందించి ఎల్లమ్మ గుడిని కూడా అపవిత్రం చేసిండ్లని ఆయన వాపోయారు. తాము ఆలయానికి సంబంధించిన డబ్బులతో ఏమేమి ఖర్చు చేశారని ఇన్ఫర్మేషన్ యాక్ట్‌లో తానే స్వయంగా అడిగితే సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఏమీ చెప్పవద్దని సమాధానం ఇచ్చారని అన్నారు. అయితే ఆలయానికి సంబంధించిన భూములు,డబ్బులు, నగలు, బంగారంలాంటి వివరాలు ఇవ్వవద్దని సుప్రీంకోర్టు తీర్పు ఉందే కానీ ఖర్చుల ను చెప్పవద్దని ఎక్కడా లేదని ఆయన వివరించారు. సుప్రీంకోర్టు తీర్పును అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కుటుంబం అవినీతి బయటపడకుండా ప్రతి పండుగకు కోట్లు దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మంథని మట్టిలో పుట్టిన బిడ్డగా ఈ ప్రాంతంను ముద్దాడిన బిడ్డగా ఆలయం అపవిత్రమైతే యావత్తు తెలంగాణకు మచ్చ వచ్చినట్లేనని భయంతో స్పందిస్తున్నట్లు చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గానికి కాళేశ్వరం పేరుతో వివిధ ప్రాంతాల నుంచి టూరిస్టులు వస్తూ వెళ్తంటే వ్యాపారులకు మేలు జరుగతది అనే ఆలోచనతో తాను అవినీతిని ప్రశ్నిస్తున్నానని అన్నారు. పుష్కరాలకు సంబంధించిన చీరల సంచులు బయటకు ఎలా వచ్చాయో ఎమ్మెల్యే ఎందుకు ఇచ్చారో అధికారి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పుష్కరాలకు ఇతర ప్రాంతాల నుంచి లక్షలు వెచ్చించి యూపీ నుంచి గంగాహారతి ఇచ్చేందుకు పురోహితులను పిలిపించారని, ఇక్కడ పురోహితులు లేరా అన్ని ఆయన ప్రశ్నించారు. మంత్రపురిగా పేరుగాంచిన మంథనిలో వేదపండితులను వదిలి వేరే ప్రాంతం నుంచి తీసుకురావడం కమీషన్‌ల కోసమేనని ఆయన విమర్శించారు. ఇక్కడి పురోహితలు, వేదపండితులకు గంగాహారతి రాదా మంత్రాలు రావా అంత నైపుణ్యత లేదా అని మంథని ఎమ్మెల్యేను నిలదీయాలన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి గళం ఎప్పటి వరకు విప్పరో అప్పటి వరకు అవినీతి ఇలాగే కొనసాగుతుందన్నారు.కాళేశ్వర ఆలయానికి మచ్చపడితే బావితరాలకు భవిష్యత్ కరాబు అయితదని ప్రతి ఒక్కరు గమనించాల్సిన అవసరం ఉందని, పుష్కరాలు సమీపిస్తున్న క్రమంలో అద్భుతంగా ఉన్న ఆలయాన్ని కూల్చివేస్తామంటున్నాడని, ముఖ్యమంత్రి పైసలు లేవని చెబుతున్నాడని ఇందులో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఓటుకు ఐదు వేలు ఇస్తామనే సంకల్పంతో ఎమ్మెల్యే కుటుంబం ఎక్కడ పడితే అక్కడ దోపిడికి పాల్పడుతున్నారని, ఎక్కడ దోపిడి చేసినా ఫర్వాలేదు కానీ పవిత్రమైన ఆలయాన్ని అపవిత్రం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. త్రివేణి సంగమంగా దక్షిణకాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో జరుగుతున్న అవినీతిని ఆపడం అందరి బాధ్యతగా గుర్తించాలని, ఎమ్మెల్యే ఆయన బార్య టూరిస్టులని, ఈ ప్రాంతలో వారికి ఎవరితో సంబంధం లేదని, ఎన్నికల సమయంలో వచ్చి ప్రజలను మోసం చేసి గెలిచి పోతున్నారే కానీ ఈ ప్రాంతంపై ఇక్కడ ప్రజలపై ఎలాంటి ప్రేమ, తపన లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్కం జనార్ధన్, లింగంపల్లి శ్రీనివాసరావు, జోడు శ్రీనివాస్, మార్క రాము గౌడ్, కుంభం రాఘవ రెడ్డి, గోనె శ్రీనివాస్ రావు, శ్రీపతి బాపు, ఆక్కరి ప్రకాష్,కేదారి గీతా, మోతె రాజు, బొంతల సతీష్, కట్ల పూర్ణ చందర్, వాసాల స్వప్న, జ్యోతుల మంజుల వెంకన్న, రత్నం సుమంజలి అవినాష్, తిరుతమ్మ, హరీష్ రెడ్డి,లక్ష్మీ చౌదరి, ధర్మమ్ సింగ్, ప్రభాకర్,రమణ ,అనిల్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అలీం, కిరణ్, జైపాల్, రాజేందర్, గురిజాల శ్రీనివాస్, జక్కం రవి, బద్దీ సమ్మయ్య, పిల్లి వేణు, శేఖర్, కాటం రాజేష్, అభిలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి- కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంతో పాటు గోన గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో గ్రామాల వారీగా గైర్హాజరైన, వలస వెళ్లిన, మరణించిన ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను స్వయంగా పరిశీలించి, డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, 18 ఏళ్లు పూర్తిచేసుకున్న యువత నుంచి ఫారం–6 ద్వారా దరఖాస్తులు స్వీకరించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం గోన గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్క నాటి నీరు పోసిన కలెక్టర్, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, సూపర్‌వైజర్లు నర్సింహులు, విజయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ రంజాన, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్-2026 ప్రారంభం- సీపీ గౌష్ ఆలం




**కరీంనగర్ జులై 07 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 3వ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్–2026 జూలై 7, 8 తేదీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించబడుతున్నాయని సీపీ తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఈ డ్యూటీ మీట్‌లో జోన్–3 పరిధిలోని కరీంనగర్, సిద్ధిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన మొత్తం 91మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. యూనిట్ వారీగా కరీంనగర్ నుంచి 24 మంది, సిద్ధిపేట నుంచి 19 మంది, రాజన్న సిరిసిల్ల నుంచి 21 మంది, కామారెడ్డి నుంచి 13 మంది, మెదక్ నుంచి 14 మంది హాజరవుతున్నారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సమర్థవంతమైన సేవల అందింపులో మరింత నైపుణ్యం సాధించేందుకు వేదికగా నిలవనుందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా శాస్త్రీయ దర్యాప్తు, యాంటీ సబోటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పోటీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మల్టీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని సీపీ తెలిపారు.పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ప్రకారం బంగారు పతక విజేతలకు రూ.3 లక్షలు, మూడు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, వెండి పతక విజేతలకు రూ.2 లక్షలు, రెండు అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్లు, కాంస్య పతక విజేతలకు రూ.1 లక్ష, ఒక అడ్వాన్స్ ఇన్‌క్రిమెంట్ అందజేయబడతాయి. అలాగే జట్టు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కూడా అందజేయనున్నారని అన్నారు. ఈ డ్యూటీ మీట్‌ను కేవలం పోటీగా కాకుండా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించి, క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్వంతో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఈ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, సమన్వయం మరింత బలోపేతమై ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి, వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వార్థ ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం..

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు**

**పెద్దపల్లి జులై 07 (వుదయం ప్రతినిధి)**

ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ...గత నాలుగు రోజులుగా బిఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ప్రాజెక్టులపై రైతులకు ప్రజలకు విష ప్రచారాన్ని చేరవేస్తున్నారని అవి ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారో ప్రజలకు, రైతులకు తెలుసని అన్నారు. రైతన్ననికి అవసరమైన నీరు అందించేందుకు పైపుల ద్వారా ఎత్తిపోసే అవసరం లేకుండానే తుమ్మడి హైట్టిని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తూమ్మిడి ఎట్టి నుండి ఎల్లంపల్లి కి నీరును తీసుకువచ్చే విధంగా రూపకల్పన చేపట్టారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక లక్ష కోట్ల రూపాయలతో ప్రజాధనాన్ని వెచ్చించి కాలేశ్వరం ప్రాజెక్ట్ తమ స్వార్థ ప్రయోజనాల కోసం వారి కుటుంబ ప్రయోజనాల కోసం నిర్మాణం చేపట్టారని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా నీళ్లను కింది నుండి పైకి ఎత్తిపోసే ప్రాజెక్ట్ కెసిఆర్ ఇంజనీర్ అవతారం ఎత్తి నిర్మించారని ఆ ప్రాజెక్టు నాలుగు నుండి ఐదు సంవత్సరాల కాలంలో ఒక సంవత్సరానికి 180 టీఎంసీల చొప్పున నీళ్ళు ఎత్తిపోసారని అబదప్పు మాటలు చెప్పి పబ్బం గడిపారు. అలా అయితే ఐదు సంవత్సరాల కాలంలో 900 టీఎంసీల నీరును పోయాల్సి ఉండగా 74.5 టిఎంసిల నీళ్లను మూడు ప్రాంతాలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్ట్ ల ద్వారా ఎల్లంపల్లికి పంపిణీ చేసి ఎల్లంపల్లి లో ఉన్న 40 టీఎంసీల నీరును కలుపుకొని కేవలం 114 టీఎంసీల నీళ్లను ఐదు సంవత్సరాలలో ఎత్తిపోసారని విమర్శించారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణ మానస పుత్రిక అని, ప్రపంచంలో ఎనిమిదో వింత అని సొంత బస్సులలో రైతులను, ప్రజలను తరలించి టూరిజం ప్రాజెక్టుగా చూపించారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఎస్సారెస్పీ ఎల్లంపల్లి వరద కాలువల ద్వారా ఈ రాష్ట్ర రైతాంగానికి కాలేశ్వరం తో సంబంధం లేకుండా గతంలో ఎన్నడు లేని విధంగా 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతంగం పండించేందుకు నీరును అందించడం జరిగిందన్నారు.



## విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ**



**నిజామాబాద్, జూలై 07 :**

వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. జక్రాన్పల్లి మండలం మునిపల్లిలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్ అపరిశుభ్రంగా ఉంది, ఈగలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత గురించి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నందున, ఏజెన్సీ ని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ముప్పిరిగొనే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడవద్దని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపిస్తూ, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బై.పీ.సీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులతో భేటీ అయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితర సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో అధికారికంగా నూతన భరోసా కేంద్ర భవనం ప్రారంభం

**బాధిత మహిళలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవల్ని అందించడమే భరోసా ముఖ్య ఉద్దేశ్యం**

**జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్**



**నిర్మల్ జిల్లా 7 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

మహిళలు, చిన్నారుల రక్షణే ప్రధాన ధ్యేయంగా ఎన్.టి.టి డేటా బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమం కింద నిర్మించిన నూతన భరోసా కేంద్రాన్ని ఈరోజు నిర్మల్ లోని ఎల్లపెల్లి లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి హాజరయ్యారు. దీనికన్నా ముందు భరోసా ఆవరణలో జిల్లా ఎస్పీ మొక్కలు నాటడం జరిగింది. మహిళలు, చిన్నారులకు భద్రత, రక్షణ, చట్టపరమైన సహాయం, మానసిక పరామర్శ, పునరావాస సేవలను ఒకే వేదికపై అందించేందుకు భరోసా సెంటర్ కీలక పాత్రపోషించనుంది. ఈ కేంద్రం ద్వారా బాధితులకు సత్వర, సమగ్ర సేవలు అందుబాటులోకి రావడంతో పాటు వారి పట్ల మరింత సున్నితమైన, సమర్థవంతమైన సహాయ వ్యవస్థ బలోపేతం కానుంది. భరోసా కేంద్రం ద్వారా బాధితులకు పోలీసు సహాయం, వైద్య సేవలు, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పునరావాస సేవలు ఒకేచోట అందించబడుతున్నాయని, బాధితులు న్యాయ ప్రక్రియ పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు శిక్షణ పొందిన కౌన్సెలర్లు, సపోర్ట్ పర్సన్లు, న్యాయ నిపుణులు, వైద్య సిబ్బంది, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం నూతన భరోసా సపోర్ట్ సెంటర్ భవన నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సహకరించిన ఎన్‌టిటి డేటా బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కునాల్ పటేల్ కు జిల్లా పోలీసు శాఖ తరపున జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఎన్‌టిటి డేటా బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కునాల్ పటేల్, సంస్థ ప్రతినిధులు శ్రీ తిరుమల రెడ్డి, శ్రీ ఖుష్ గుప్తా, శ్రీ అనిల్, శ్రీ సాయి కిరణ్, శ్రీ శివచరణ్ రెడ్డి, న్యాయాధికారులు, పోలీసు అధికారులు, భరోసా కేంద్ర సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలి...

**ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి...**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**



**జగిత్యాల జులై 07 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు మంగళవారం బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయి తాళ్ల ధర్మారం తుంగూరు గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు పాఠశాలల్లోని వంట గదులు ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పాఠశాలల్లో నిర్మిస్తున్న వంట గదులు అన్ని సౌకర్యాలతో పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సారంగాపూర్ మండలంలోని నాగపుగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు అర్హులైన ప్రతి ఓటరు నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కల్పించాలని దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నమోదు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమాల్లో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ ఈఈ (పీఆర్) లక్ష్మణరావు మండల తహసీల్దార్లు ఎంపీడీవోలు బిఎల్ఓలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ కక్షల హంతకుడికి కోర్టు గట్టి షాక్.!

**రెండు హత్య కేసుల్లో రెండుసార్లు యావజ్జీవ కారాగార శిక్ష**

**సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు**

**దర్యాప్తు బృందాన్ని అభినందించిన ఎస్పీ**



**రాజన్న సిరిసిల్ల, జూలై 07 : {వుదయం ప్రతినిధి} :**

భూ వివాదాల నేపథ్యంలో వేర్వేరు సందర్భాల్లో ఇద్దరిని దారుణంగా హత్య చేసిన కేసుల్లో నిందితుడికి జిల్లా కోర్టు రెండుసార్లు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు హత్య కేసుల్లో నిందితుడు వంగా సందీప్ రెడ్డిపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వంగా సందీప్ రెడ్డికి భూ వివాదాల కారణంగా బీనబోయిన దేవయ్యతో విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2018 మార్చి 17న కుటుంబ వేడుకకు వచ్చిన దేవయ్యపై కత్తితో దాడి చేయగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు.అదే నిందితుడు 2022 జూలై 31న మరో భూ వివాదం నేపథ్యంలో కామారెడ్డి జిల్లాకు చెందిన మన్నె నరసింహులుపై గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనపై నమోదైన కేసులో అప్పటి సీఐ మొగిలి దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు.ఈ రెండు కేసుల్లో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో దర్యాప్తు అధికారులు, కోర్టు మానిటరింగ్ బృందం, పబ్లిక్ ప్రాసిక్యూషన్ సమన్వయంతో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను కోర్టు ముందు సమర్పించారు. మొత్తం 20 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువైందని నిర్ధారించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రెండు కేసుల్లోనూ నిందితుడు వంగా సందీప్ రెడ్డికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసుల్లో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, అప్పటి, ప్రస్తుత సీఐలు బన్సీలాల్, మొగిలి, వెంకటేష్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ తదితరులను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రత్యేకంగా అభినందించారు.నేరస్థులు ఎంతకాలమైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, పటిష్టమైన దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాలు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ద్వారా నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా పోలీసులు చర్యలు తీసుకుంటారని ఎస్పీ పేర్కొన్నారు.

## కెనాల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్: డ్రైవర్ దుర్మరణం

**ధర్మపురి మండలం నేరెళ్లలో విషాదం**

**మలుపు వద్ద అదుపుతప్పిన వాహనం**

**అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన గౌరి గంగయ్య**



**ధర్మపురి, జూలై 07 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని నేరెళ్ల గ్రామంలో సోమవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కెనాల్‌లోకి దూసుకెళ్లిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందా డు.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొలం పనులుముగించుకుని వస్తుండగా నేరెళ్ల గ్రామానికిచెందిన గౌరి గంగయ్య (42) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.రోజువారీ పనుల్లో భాగంగా సోమవారం యజమానికి చెందిన ట్రాక్టర్‌తో నేరెళ్ల కెనాల్ సమీపంలోని పొలా లకు వెళ్లాడు.రోజంతా పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తున్న క్రమంలో కెనాల్ వద్ద ఉన్న మలుపు వద్దకు రాగానే ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పింది. ప్రమాద తీవ్రతకు ట్రాక్టర్ నేరుగా కెనాల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భారీ ట్రాక్టర్ గంగయ్యపై పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో గంగయ్యఅక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకు న్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.పోలీసుల దర్యాప్తుమృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వఆసుపత్రికితరలించారు. మృతుడి భార్య గౌరి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ఐ.మహేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



**కామారెడ్డి, జూలై 7 (వుదయం ప్రతినిధి):**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మంగళవారం మొహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో పర్యటించి ఎస్ఐఆర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మొదట మొహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామం, పోలింగ్ స్టేషన్ నెం. 251ను సందర్శించి బూత్ లెవల్ అధికారి, సూపర్వైజర్, తహసీల్దార్‌తో కలిసి ఇంటింటి ఎన్యుమరేషన్, ఓటరు వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.అనంతరం నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్, బంజేపల్లి గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పనులను సమీక్షించారు.బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, తహసీల్దార్‌తో మాట్లాడి ఇంటింటి సర్వే, ఫారాల స్వీకరణ, ఓటరు వివరాల నమోదు, డిజిటైజేషన్ పనుల పురోగతిపై ఆరా తీశారు.ఈ పర్యటనలో సంబంధిత తహసీల్దార్లు, బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నెపల్లి పంపు హౌస్‌లను తక్షణమే ఆన్ చేయాలి

**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేల ఎకరాల్లో ఎండిపోతున్న పంటలు**

**కేసీఆర్‌పై కోపంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు**

**రైతుల పక్షాన బీఆర్ఎస్ రాజీలేని పోరాటం**

**మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి**



**ధర్మపురి,జూలై 7(వుదయం ప్రతినిధి):**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన కన్నెపల్లి పంపు హౌస్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిలిపివేసింద ని,దీనివల్ల రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరు కుపోయే ప్రమా దం ఏర్పడిందని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం ధర్మపురి పట్టణ కేంద్రం లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి విలే కరుల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ,దేశంలోనే అతిపెద్ద ఎత్తి పోతల పథకమైన కాళేశ్వరాన్ని నిర్మిం చి,కన్నెపల్లి ద్వారా లక్షల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.గత ప్రభుత్వంలో ఒక్క రోజు కూడా ఆగకుండా నిరంతరా యంగా నడిచిన పంపు హౌస్‌లను, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బంద్ పెట్టడం దుర్మార్గమని,ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక చర్య అని ధ్వజమెత్తా రు.వానా కాలం మొదలైంది నీళ్లు ఆపేస్తే రైతుల పరిస్థితి ఏంటి ప్రస్తుతం వానా కాలం సీజన్ మొదలై రైతులు నారుమ ళ్లు పోసుకునే సమయం ఆసన్నమైంది. ఈ కీలక దశలో సాగునీరు ఆపేస్తే రైతు ల పరిస్థితి ఏంటో ప్రభుత్వం సమాధా నం చెప్పాలి. వర్షాభావ పరిస్థితుల్లో సాగు నీటి గోసను దృష్టిలో పెట్టు కొని రైతుల పక్షాన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ కోరినట్లుగా కాళేశ్వరం లో అంతర్భా గమైన కన్నెపల్లి పంపు హౌస్‌ను తక్షణమే ప్రారంభించి సాగుకు నీరందించాలి అని శ్రీకాంత్ రెడ్డి డిమాం డ్ చేశారు.పంటలు ఎండిపోతే దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించా ల్సి ఉంటుందని హెచ్చరించారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ పై ఉన్న రాజకీయ కోపంతోనే కాళేశ్వరం ప్రాజె క్టుపై కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటికైనా అధికారులు, ప్రజలకు నిజనిజాలు తెల పాలని, అబద్ధపు ప్రచారాలు మానుకో వాలని హితవు పలికారు.ప్రభుత్వం బేషజాలకు పోకుం డా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియో గించుకొని రైతుల కష్టాలు తీర్చాలన్నా రు. కన్నెపల్లి పంపు హౌజ్ ద్వారా నీటి ని ఎత్తిపోసేంతవరకు బీఆర్ ఎస్ పార్టీ శ్రేణులు రాజీలేని పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ,మం డల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమా ర్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, బీఆర్ఎస్ నాయకులు సంగి శేఖర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్,బండారి అశోక్, చుక్క రవి,తరాల్ల.కార్తీక్,గుర్రాల సుధా కర్, అనంతు ల లక్ష్మణ్,ఎండీ షమీ మా,కుక్కల గంగారెడ్డి,మోలుగూరి రాజన్న, స్తంభంకాడి మహేష్, మామిడి శ్రీనివాస్, కాశెట్టి.విజయ్, కళ్లెం రిషిరెడ్డి, మూటపెల్లి లడ్డు,మోలు గూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు : జిల్లా కలెక్టర్

**ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన**

**రెండు రోజుల్లో పూర్తి చేయాలి**

**గుడిసె రహిత నగరమే లక్ష్యంగా అధికారులకు దిశానిర్దేశం**



**పెద్దపల్లి, జూలై 07 (వుదయం ప్రతినిధి)**

రామగుండం నియోజకవర్గంలో పేద ప్రజలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యమని, ఇందుకోసం రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ గృహ వసతి కల్పించే దిశగా చేపడుతున్న చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఉన్న ఎల్–1 (L1), ఎల్–2 (L2) దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు రాబోయే రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మొదటి, రెండవ దశల్లో ఇందిరమ్మ కమిటీల నుంచి అందిన జాబితాను చాలా జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.ప్రభుత్వ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రస్తుతానికి గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నగరాన్ని గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని, ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు.నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి, ఎల్–2 జాబితాలో ఉన్న అర్హులను ఎల్–1కు పంపడం ద్వారా అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఆర్డీవో గంగయ్య, ఈ. డి. యం.కవిత,సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# బీసీ , ఎస్సి , ఎస్టీ -జెఏసి జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగిత్యాల అర్బన్ సూకపెల్లి డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీల సమస్యల పరిష్కార..!!




మల్యాల ,మండలం జూలై 07 ( వుదయం ప్రతినిధి )జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి అర్బన్ డబుల్ బెడ్రూమ్స్ కాలనీలో అలాట్మెంట్ అయిన యజమానులను ఎంక్వయిరీల పేరుతో భయాందోళనలకు గురి చేస్తున్నారు. ప్రభుత్వం కనీస అవసరాలను సమకూర్చకుండా, ఇండ్లు కేటాయించడం వలన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. అందులో ముఖ్యంగా లబ్దిదారులు కూలిపనులు చేసుకునేవారు, చిరు వ్యాపారాలు, ప్రైవేటు గుమస్తా ఉద్యోగాలు చేసుకునేవారు ప్రతిరోజు ఉపాధి నిమిత్తం జగిత్యాల పట్టణానికి రావల్సి ఉంటుంది. వారికి రవాణా సౌకర్యం లేకపోవడం వలన ఆర్థికంగా నష్టపోతున్నారు. రెండవది అక్కడ నివసిస్తున్నా వారికి ఉన్నటువంటి ప్రధానమైన సమస్యలు.

వీధి దీపాలు చౌరస్తాలో ఐమాక్స్ లైట్స్ నెలకొల్పాలి,పారిశుద్ధ్యమునకు సరిపడా మున్సిపల్ సిబ్బందిని కేటాయించడం, మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు, పట్టణానికి దూరంగా ఉండడం వలన అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నందున తక్షణమే ఒక పోలీస్ స్టేషన న్ను నెలకొల్పాలి, లబ్దిదారులందరికి వెంటనే అక్కడ రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలి ,ఇప్పుడున్నటువంటి డిజిటలైజేషన్ పరిస్థితులకి అనుగుణంగా వారికి ఆ ప్రదేశంలో సిగ్నల్ సమస్యలు ఉన్నందున ఆ ప్రదేశంలో అత్యవసరంగా సెల్ టవర్స్ ని ఏర్పాటు చేయించగలరు, కాలనీలో ప్రభుత్వ పాఠశాలను నెలకొల్పాలి ,అక్కడ ఉన్నటువంటి జనాభాకు సరిపడే అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగం అవకాశాలు కల్పించాలి , పూర్తిస్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఏర్పాటు చేయాలి , కాలనీకి సమీప ప్రాంతంలో డంపింగ్ యార్డు ఉండడం వలన ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. డంపింగ్ యార్డ్ని అక్కడి నుండి దూరంగా తరలించాలి, రీసైక్లింగ్ చేయుటకు గతంలో యంత్రాలు ఉండేవి. ప్రస్తుతం వాటిని తొలగించినారు. వాటిని వెంటనే సమకూర్చగలరు ,భిన్న మతాల ప్రజలు నివసిస్తున్నందున వారి వారి మత ఆచారాల ప్రకారం స్మశాన వాటికల వసతి కల్పించాలి, గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు అసంపూర్ణంగా ఉండడం వల్ల ప్రజలకి ఉపయోగంలో లేవు. కావున ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇస్తున్నా 5లక్షలను ఇందిరమ్మ లబ్దిదారులకి 5 లక్షలను కేటాయించాలి. తక్షణమే ఆగిపోయిన వారి ఇంటి నిర్మాణానికి సహకరించాలి.

పై సమస్యలను లబ్దిదారులు ప్రజావాణిలో పలుమార్లు ఇట్టి సమస్యలపైన విజ్ఞాపన పత్రాలు ఇచ్చినప్పటికిని సమస్యలు పరిష్కారం కానందున బీసీ , ఎస్సి , ఎస్టీ – జెఏసి జగిత్యాల జిల్లా కమిటి ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించుట కొరకు విజ్ఞప్తి చేస్తున్నాము.

పై సమస్యలను పరిస్కరించని యెడల జగిత్యాల జిల్లాలో పునః ప్రారంభం కానున్న 1 లక్ష కిలో మీటర్ల మా భూమి రథ యాత్ర తో బీసీ ,ఎస్సి ,ఎస్టీ –జెఏసి రాష్ట్ర చైర్మన్ డా . విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ,ప్రజాపోరటానికి నాంది పలుకుతాం అని తెలియజేస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ , ఎస్సి , ఎస్టీ –జెఏసి జిల్లా అధ్యక్షుడు మనల కిషన్ ,ప్రధాన కార్యదర్శి పాడాల శ్రీనివాస్,శివ మహారాజ్, గొల్లపల్లి శ్రీకాంత్, చేనీ అనిల్ ,అశోక్, అర్బన్ కాలనీ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి ఉపాధ్యక్షురాలు కంటే విజయ పన్నీరు శేఖర్,లక్ష్మీనారాయణ తదితురులు పాల్గొన్నారు..



# డ్రైనేజీ పరిశుభ్రత పనులు , ఈఓ ఆదేశాలు

మల్యాల ,మండలం జూలై 07 ( వుదయం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంనుండి తాటిపల్లి గ్రామానికి వెళ్లే మార్గ పక్కనే ఉన్న మేజర్ డ్రైనేజీని గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బందులు మంగళవారం రోజున డ్రైనేజీ చెత్తను తీసేసి పరిశుభ్రం చేశారు. పంచాయితీ ఈఓ శ్రీకాంత్ ఆదేశాల మేరకు మల్యాల గ్రామ వీదుల్లోని డ్రైనేజీ లోని చెత్తను ఎప్పటికప్పుడు తీసేలని , బ్లీచింగ్ పౌడర్ వంటి కీటక నాశలను ఉపయోగించాలని దీనివలన వర్షాకాలంలో వచ్చే వైరల్ వ్యాదులను అరికట్టవచ్చని తెలిపారు.

# డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో రామక్రిష్ణ విద్యార్థుల విజయకేతనం..




కోరుట్ల జులై 07 (వుదయం ప్రతినిధి) శాతవాహన యూనివర్సిటీ సోమవారం సాయంత్రం ప్రకటించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ (ఆర్ 25) నాలుగవ ఆరవ సెమిస్టర్ (ఆర్ 19) ఫలితాలలో రామక్రిష్ణ విద్యార్థులు విజయ పరంపర కొనసాగించారు బీఎస్సీ విభాగంలో ఈర్నాల శృతి 9.68 జిపిఏ శివరాత్రి వైష్ణవి 9.44 జీపీఏ పిట్టల ప్రవళిక 9.28 జిపిఏ ద్యావనపెల్లి హర్షిత 9.20 జిపిఏ సారా ముస్తాక్ హుస్సేన్ 9.12 జిపిఏ బీకాం విభాగంలో ఓశ శృతి 9.60 జిపిఏ మామిడిపల్లి పల్లవి 9.24 జిపిఏ ముస్కాన్ 9.20 జిపిఏ రాచకొండ మాధవ్ 9.08 జిపిఏ గడ్డం శ్రీనిధి 9.0 జిపిఏ సాధించారు ఆరవ సెమిస్టర్ లో చింతకుంట హాసిని 9.0 సిజిపిఏ బత్తుల ప్రతిభ 9.27 ఎస్ జి పి ఏ సల్వనాజ్ 8.74 సిజిపిఏ నస్రా సమర్ 8.52 సిజిపిఏ ఆఫ్రిన 8.01 సిజిపిఏ కూనపెల్లి మౌనిక 8.67 సిజిపిఏ గడి దాసుల లహరి 8.41 సిజిపిఏ దుంపేట వర్షిని 8.37 సిజిపిఏ.కెలేటి భవాని 8.15 సిజిపిఏ జికూరి వర్ష 8.82 జిపిదాసరి రక్ష 8.79 జిపిఏ మ్యాథరి మయూరి 8.60 జిపిఏ భీమనాతి శివాని 8.58 జీపీఏ చెన్నూరి కృష్ణవేణి 8.28 జీపీఏ సానియా ఆఫ్రిన్ 8.05 జిపిఏ ఓటారికారి నికిత 8.44 జిపిఏ బాలే దివ్య విద్యసాగర్ 8.31 జిపిఏ సాధించారు శాతవాహన యూనివర్సిటీ లోనే ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ యాద రామక్రిష్ణ సన్మానించారు ఈకార్యక్రమంలో డైరెక్టర్ గాడిపెల్లి హరిప్రియ అంజయ్య గౌడ్ ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# మహిళా పోలీసుల ఆరోగ్య రక్షణకు జిల్లా పోలీసుల ప్రత్యేక చొరవ...

**మహిళా పోలీసుల ఆరోగ్యమే విధి నిర్వహణకు కుటుంబ సంక్షేమానికి బలమైన పునాది...**

**మహిళా పోలీసులకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్...**

**జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**




జగిత్యాల జులై 07 (వుదయం ప్రతినిధి) జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అధికారుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ తెలిపారు ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబానికి సమాజానికి పోలీసు శాఖకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరన్నారు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు అధికారులకు సర్వైకల్ క్యాన్సర్పై అవగాహన కల్పించి వ్యాధి నివారణ లక్ష్యంగా జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ హాల్లో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈకార్యక్రమానికి జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళా పోలీసు అధికారులు సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని మహిళా పోలీసు సిబ్బంది కుటుంబ బాధ్యతలతో పాటు విధి నిర్వహణలోనూ విశేష సేవలందిస్తున్నారన్నారు అలాంటి మహిళా సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరన్నారు మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈఅవగాహన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు సర్వైకల్ క్యాన్సర్ ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్లలో ఒకటని అయితే సరైన సమయంలో హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని చాలా వరకు నివారించవచ్చని తెలిపారు మహిళలు ఆరోగ్యానికి సంబంధించిన ఎలాంటి సమస్యనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు పోలీసు శాఖలో సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు ఈసందర్భంగా వైద్య నిపుణులు సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు వ్యాధి నివారణ మార్గాలు హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రాముఖ్యత ఆరోగ్యకరమైన జీవనశైలి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై మహిళా పోలీసు సిబ్బందికి వివరించారు అనంతరం అర్హులైన మహిళా పోలీసు సిబ్బందికి సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ అందజేశారు ఈకార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డాక్టర్ గుడూరి హేమంత్ కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ ఎస్ఐ లు గీత సుప్రియ వైద్య సిబ్బంది డాక్టర్ పద్మిని డాక్టర్ జి శ్రీలత డాక్టర్ మంగాదేవి డాక్టర్ అరుణ డాక్టర్ జయంతి మహిళా పోలీసు అధికారులు మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం..!

***మంథని పట్టణం, మండలంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు***

***అధిక ధరలకు విక్రయాలు.. యువతను మద్యానికి బానిసలుగా మారుస్తున్న అక్రమ వ్యాపారం***

***వైన్ షాపుల నుంచే సరఫరా జరుగుతోందనే ఆరోపణలు.. ఎక్సైజ్ శాఖ తీరుపై మహిళల ఆగ్రహం***



మంథని పట్టణంలో శ్రీపాదరావు విగ్రహం ఎద్దుటగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్

మంథని , జూలై 7 (వుదయం ప్రతినిధి ):మంథని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కిరాణా దుకాణాల మాటున బెల్ట్ షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతితో నడిచే మద్యం విక్రయ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ అక్రమ మద్యం వ్యాపారం రోజురోజుకూ విస్తరిస్తోందని అంటున్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, మంథని పట్టణంలోని శ్రీపాదరావు విగ్రహం ఎదుట కూడా బెల్ట్ షాపు ద్వారా తెల్లవారుజామున నుంచే రాత్రి వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో యువత ఎక్కువగా అక్కడికి ఆకర్షితులవుతూ మద్యానికి బానిసలవుతున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.అధిక ధరలకు విక్రయాలుబెల్ట్ షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకుని వినియోగదారులను దోచుకుంటున్నారని, దీనివల్ల కూలీలు, రైతులు, సామాన్య కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు.24 గంటలూ అందుబాటులో మద్యంనిబంధనల ప్రకారం నిర్ణీత సమయాల్లో మాత్రమే మద్యం విక్రయాలు జరగాల్సి ఉండగా, బెల్ట్ షాపుల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకు, కొన్నిచోట్ల దాదాపు రోజంతా మద్యం అందుబాటులో ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల గ్రామాల్లో మద్యపానం విపరీతంగా పెరిగి యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వైన్ షాపుల పాత్రపైనా అనుమానాలుస్థానికుల ఆరోపణల ప్రకారం, కొన్ని వైన్ షాపుల నుంచే బెల్ట్ షాపులకు పెద్ద మొత్తంలో వివిధ బ్రాండ్ల మద్యం సరఫరా జరుగుతోందని చెబుతున్నారు. వ్యక్తిగత వినియోగం కోసం విక్రయించాల్సిన మద్యం అక్రమ పునర్విక్రయానికి వెళ్తోందా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వైన్ షాపులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రి హెచ్చరించినా తగ్గని బెల్ట్ షాపులుమంథని నియోజకవర్గంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలిస్తామని, అక్రమంగా నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు గతంలో ప్రకటించినప్పటికీ, మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మంత్రి సూచనలను కూడా కొందరు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

మద్యపాన నిషేధం వైపు కొన్ని గ్రామాలుమరోవైపు మండలంలోని కొన్ని గ్రామాలు మాత్రం ఆదర్శంగా నిలుస్తున్నాయి. దుబ్బపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి కృష్ణవేణి--నరేష్ రావు గ్రామంలో బెల్ట్ షాపులు లేకుండా చర్యలు ప్రారంభించగా, గాజులపల్లి సర్పంచ్ సుధాకర్ కూడా గ్రామంలో మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్, పోలీసు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇటువంటి చర్యలను మండలంలోని అన్ని గ్రామాల్లో అమలు చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.రోజంతా కష్టపడి సంపాదించిన కూలి డబ్బును చాలామంది మద్యానికే ఖర్చు చేస్తున్నారని, ఇంటికి నిత్యావసర సరుకులు తీసుకురాకపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం కారణంగా కుటుంబ కలహాలు, అప్పులు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు.ఎక్సైజ్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలిమంథని పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఆకస్మిక దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారితో పాటు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలిన వైన్ షాపులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, సంబంధిత ఎక్సైజ్ అధికారులు, పోలీసు శాఖ సంయుక్తంగా మండలవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని మహిళా సంఘాలు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. యువత పెడదారిన పడకముందే కఠిన చర్యలు తీసుకొని అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

# హోటళ్లలో ఇష్టారాజ్యంగా టిఫిన్ ధరల పెంపు

**ఆరు నెలల్లో రెండోసారి భారీగా పెరిగిన రేట్లు.. సామాన్యులపై అదనపు భారం**

**క్వాలిటీ, క్వాంటిటీ యథాతథం.. ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వినియోగదారుల డిమాండ్**




మంథని , జూలై 7 (వుదయం ప్రతినిధి)మంథని పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా టిఫిన్ ధరలను పెంచుతూ సామాన్యులపై అదనపు భారం మోపుతున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండోసారి టిఫిన్ ధరలను భారీగా పెంచడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.30కు లభించిన పలు టిఫిన్లను ప్రస్తుతం రూ.50 వరకు విక్రయిస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. అయితే ధరలు పెంచినప్పటికీ టిఫిన్ క్వాలిటీలో గానీ, క్వాంటిటీలో గానీ ఎలాంటి మార్పు లేదని ఆరోపిస్తున్నారు. అదే నాసిరకం నాణ్యత, అదే పరిమాణంలో ఆహారం అందిస్తున్నారని వాపోతున్నారు. అధిక ధరలపై ప్రశ్నించిన వినియోగదారులకు గ్యాస్ ధరలు పెరిగాయ్ అంటూ సమాధానం చెబుతున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, ఆ తగ్గుదల ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించడం లేదని ఆరోపిస్తున్నారు.మరోవైపు, చాలా హోటళ్లలో ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించడం లేదని, ధరలు పెంచిన తర్వాత కూడా వినియోగదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఏ హోటల్లో ఏ టిఫిన్కు ఎంత ధర వసూలు చేస్తున్నారనే విషయంలో పారదర్శకత లేకుండా పోతోందని అంటున్నారు.

**ధరల పెంపులో పారదర్శకత ఎక్కడ..?**

హోటల్ నిర్వాహకులు ధరలు పెంచినప్పుడు వాటిని స్పష్టంగా ధరల పట్టికలో ప్రదర్శించి వినియోగదారులకు ముందుగానే తెలియజేయాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే పెంచిన ధరలకు అనుగుణంగా ఆహారం నాణ్యత, పరిమాణం ఉండేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం చాలా హోటళ్లలో ఇడ్లీ, వడ, దోసె, పూరీ వంటి టిఫిన్లకు నిర్ణీత పరిమాణం లేదా బరువు ఎంత ఉండాలనే సమాచారం వినియోగదారులకు అందుబాటులో లేదు. ఒక్కో హోటల్ ఒక్కో విధంగా పరిమాణం ఇస్తుండటంతో వినియోగదారులు నష్టపోతున్నారని ఆరోపిస్తున్నారు. ధరలు పెంచినప్పటికీ క్వాలిటీ, క్వాంటిటీ మాత్రం పెరగడం లేదని వాపోతున్నారు.

**అధికారులు రంగంలోకి దిగాలని డిమాండ్**

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ (తూనికలు--కొలతల) శాఖ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు. హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, ధరల పట్టికలు, వినియోగదారులకు అందిస్తున్న ఆహార పరిమాణం, నిబంధనల అమలు వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అన్ని హోటళ్లలో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులు చెల్లించే ధరకు తగిన నాణ్యత, పరిమాణం ఉండేలా మార్గదర్శకాలు అమలు చేయాలని కోరుతున్నారు.నిత్యావసర వస్తువుల ధరలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలపై హోటళ్లలో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న టిఫిన్ ధరలు మరింత ఆర్థిక భారంగా మారుతున్నాయని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఆయిల్‌పామ్ నాట్లకు ముందే డ్రిప్ ఏర్పాటు పూర్తి చేయాలి

**: జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్**

**జాప్యం చేస్తే డ్రిప్ కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేస్తాం**

**రైతులకు పూర్తి సహకారం అందించాలని సూచన**

**ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు పొందాలి**



పెద్దపల్లి, జూలై 07 (వుదయం ప్రతినిధి) ఆయిల్‌పామ్ తోటల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, తోటల నాటడానికి ముందే ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు.?మంగళవారం పెద్దపల్లి మండలంలో డ్రిప్ ఏర్పాటు చేసిన పలు పొలాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్,, మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ సామగ్రిని రైతులకు సకాలంలో అందజేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సరఫరాలో గానీ, ఏర్పాటు పనుల్లో గానీ ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, జాప్యం జరిగినా సంబంధిత కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రిప్ కంపెనీల నిర్లక్ష్యం వల్ల ఒక్క ఆయిల్‌పామ్ మొక్క కూడా ఎండిపోకూడదని, ప్రతి మొక్కకు సక్రమంగా నీరందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేస్తూ, పైపులైన్ల ఏర్పాటు కోసం ట్రెంచ్‌లు తవ్వడం వంటి పనుల్లో కంపెనీలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం ఎస్సీ/ఎస్టీ రైతులకు 90%, ఇతర రైతులకు 80% మరియు 5 ఎకరాలు దాటిన వారికి 70% రాయితీపై డ్రిప్ పరికరాలను అందిస్తుందని గుర్తు చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, 1బి డాకుమెంట్లను సమర్పించాలని తెలిపారు.?అనంతరం రంగంపల్లి గ్రామానికి చెందిన రైతు పూదారి చంద్రశేఖర్ 3 ఎకరాలలో డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ కూరగాయల తోటను పరిశీలించి, ఆయనను అభినందించారు. నీటిని పొదుపు చేస్తూ, శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లాలోని ఇతర రైతులకు సూచించారు.

# అంబేద్కర్ సంఘానికి మినీ ఫంక్షన్ హాల్ మంజూరు చేయాలి..

**రాష్ట్ర ఎస్సి ఎస్టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం అందజేత...**



కోరుట్ల జులై 07 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామంలో అంబేద్కర్ సంఘానికి మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ అంబేద్కర్ సంఘం సభ్యులు (మాదిగ సంఘం) రాష్ట్ర ఎస్సి ఎస్టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరు కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు దీనికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణా రావు లకు మోహన్ రావు పేట గ్రామ సర్పంచ్ సరికెళ్ల లతిక నరేష్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు శనిగారపు వినోద్ శనిగారపు రాజయ్య నల్ల గంగరాజం లింగంపల్లి చిన్న నర్సయ్య మంతెన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## కుటుంబ సమేతంగా కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

మల్యాల మండలం జూలై 07 ( వుదయం ప్రతినిధి )



జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ ముఖ్య అర్చక లక్ష్మణ చారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి స్వామివారి ఆశీర్వచనం అందించారు.

ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని, స్వామివారి కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సుపేరెండేంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ ఉన్నారు.

## చిన్నారుల కోసం 'ట్రంప్ అకౌంట్స్'

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీసు నుంచి న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్, నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సోమవారం నాటి ట్రేడింగ్ ప్రారంభ గంటను మోగించారు. స్టాక్ మార్కెట్ వృద్ధికి తన ఆర్థిక విధానాలే కారణమని చూపించే ప్రయత్నం చేశారు. నవంబరు మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో అమెరికన్లు 401(కే) పెట్టుబడులపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే పిల్లల కోసం స్టాక్ ఇండెక్స్ పెట్టుబడులను ప్రోత్సహించే 'ట్రంప్ అకౌంట్స్' పథకాన్నీ ప్రారంభించారు.





# జూన్ వాహనాల రిటెయిల్ విక్రయాల్లో 21.83 శాతం వృద్ధి



భారత్‌లో జూన్‌లో మొత్తం వాహనాల రిటెయిల్ విక్రయాలు 21.83 శాతం పెరిగి 25,57,234 వాహనాలుగా నమోదయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో 20,98,996 వాహనాలను కంపెనీలు విక్రయించాయని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) తెలిపింది. కార్లు, వ్యాన్‌లు లాంటి ప్యాసింజర్ వాహనాల (పీవీలు) రిటెయిల్ విక్రయాలు 2025 జూన్‌లోని 3,19,412 వాహనాల నుంచి 28.63 శాతం పెరిగి 4,10,853 వాహనాలకు చేరాయి. ద్విచక్ర వాహనాల రిటెయిల్ అమ్మకాలు 21.22 శాతం పెరిగి 18,28,458 వాహనాలుగా నమోదయ్యాయి. గతేడాది జూన్‌లో ఈ సంఖ్య 15,08,378 వాహనాలుగా ఉంది. త్రిచక్ర వాహనాల అమ్మకాలు 1,04,035 వాహనాల నుంచి 16.2 శాతం పెరిగి 1,20,889 వాహనాలకు చేరాయి. వాణిజ్య వాహనాల అమ్మకాలు కూడా 16.88 శాతం పెరిగి 90,972 వాహనాలకు చేరాయి. 2025 జూన్‌లో ఈ వాహనాల అమ్మకాలు 77,836 వాహనాలుగా నమోదయ్యాయి. భారత్‌లో వాహనాల రిటెయిల్ విక్రయాల్లో జూన్ నెలపరంగా ఇప్పటివరకు ఇవే అత్యధికం. త్రిచక్ర, ద్విచక్ర, వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ వాహనాల విభాగాలన్నీ అత్యధిక జూన్ నెల అమ్మకాల గణాంకాలను నమోదు చేశాయని ఫాడా అధ్యక్షుడు సి ఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. జులై నెలలో 51.24 శాతం డీలర్లు అమ్మకాల్లో వృద్ధిని అంచనా వేస్తుండగా.. 41.79 శాతం డీలర్లు స్తబ్దుగా ఉండొచ్చని, 6.97 శాతం డీలర్లు అమ్మకాలు తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు.

# ఇ-25 పెట్రోల్‌పై ఇంకా ఆ ప్రతిపాదనలు లేవు: కేంద్రం




ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియలో భాగంగా ఇ-25 (E25 ethanol)పెట్రోల్‌ను కూడా తీసుకొస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. పలు వాహన మోడళ్లపై ఇ-25 పెట్రోల్ ఇంకా పరీక్షల దశలోనే ఉందని పేర్కొంది. ఆ నివేదికలు రాకముందే ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది. ఇ-25 పెట్రోల్ రోల్‌అవుట్ చేశారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని కేంద్రం పేర్కొంది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి ఇలాంటివి వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని కోరింది. నిబంధనలకు అనుగుణంగా అన్ని దశల పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాకనే ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియ తీసుకొచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. ఇ-20 పెట్రోల్ పూర్తిగా సురక్షితమైనదని మరోసారి స్పష్టం చేసింది. కాగా, ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌తో ఇప్పటికే దేశ వ్యాప్తంగా సుమారు 20కోట్ల ద్విచక్ర వాహనాలు, 20 లక్షల ఫోర్ వీలర్ వాహనాలు నడుస్తున్నాయని, వాటిలో ఎలాంటి సమస్యలూ రాలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## యువోటెక్+585 డీఐ వీ1 ట్రాక్టరు దేశ వ్యాప్తంగా విడుదల



బహుళ ప్రయోజిత ట్రాక్టరు యువోటెక్+ 585 డీఐ వీ1ను దేశవ్యాప్తంగా విడుదల చేసినట్లు మహీంద్రా ట్రాక్టర్స్ తెలిపింది. 'ఇప్పటివరకు కొన్ని ఎంపిక చేసిన విపణుల్లోనే ఈ ట్రాక్టరును విడుదల చేశాం. ఇప్పుడు దేశవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. యువోటెక్ ప్లాట్‌ఫామ్‌పై తయారైన ఈ ట్రాక్టరు అధునాతన సాంకేతికత, బలమైన పనితీరు, అవసరమైన ప్రత్యేకతల కలయికగా ఉంటుంద'ని సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) హర్ష్ రాయ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో ఏడు కొత్త ట్రాక్టర్ల మోడళ్లను కూడా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

# ఆగస్టు 1 నుంచి ఓపెన్ మార్కెట్ బైబ్యాక్



స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ ప్రక్రియను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పునురుద్ధరించింది. సవరించిన మార్పులతో ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇకపై ఆఫర్ ప్రారంభమైన రోజు నుంచి 66 పనిదినాల్లోపే కంపెనీ బైబ్యాక్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎలాంటి బైబ్యాక్ విండో లేకుండానే రెగ్యులర్ ట్రేడింగ్‌లో షేర్లను తిరిగి కొనుగోలు చేయొచ్చు. క్యాపిటల్ మార్కెట్ల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సెబీ ఈ చర్యలను చేపట్టినట్లు తెలుస్తోంది.

2025లో ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను సెబీ గతంలో నిలిపివేసింది. ప్రస్తుతం బైబ్యాక్ ప్రక్రియలో కంపెనీ నిర్దేశిత ధర వద్ద, తమ వాటాదార్ల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుంటుంది. కానీ ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లో స్టాక్ ఎక్స్ఛేంజీలో ఆ రోజు ఉన్న ధర వద్ద షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేస్తుంది. గతంలో ఈ గడువు 6 నెలలుగా ఉండగా.. ఇప్పుడు 66 పనిదినాల్లోపే ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను పూర్తి చేయడం తప్పనిసరి చేసింది. ఆఫర్ కాలంలోని మొదటి అర్ధభాగంలోనే బైబ్యాక్‌కు కేటాయించిన నిధుల్లో కనీసం 40 శాతం నిధులను కంపెనీ ఉపయోగించాల్సి ఉంటుంది. గతంలో కంపెనీలపై పడే పన్ను భారాన్ని ఇకపై వాటాదార్లపైకి మార్చారు. దీని వల్ల ఓపెన్ మార్కెట్‌లో షేర్లు అమ్మినా లేదా బైబ్యాక్‌లో టెండర్ చేసినా పన్ను ఒకేలా ఉంటుంది. ఈ సమాచారాన్ని ఈమెయిల్/ఎస్సెమ్మెస్ ద్వారా మదుపర్లకు తెలియజేయాలి. బైబ్యాక్ ప్రతిపాదనల కోసం కచ్చితంగా మర్చంట్ బ్యాంకర్‌ను నియమించాలనే నిబంధననూ సెబీ తొలగించింది. దీనివల్ల కంపెనీలకు అదనపు ఖర్చులు తగ్గనున్నాయి.

# మిగిలిపోతున్న సైబర్ భద్రతా ఉద్యోగాలు

సాంకేతిక నైపుణ్యంతో పాటు వ్యాపార చతురత కలిగిన నిపుణులను తమకు అవసరమైన సంఖ్యలో ఎంపిక చేసుకోవడంలో కంపెనీలు వెనుకబడుతున్నాయి. ఇందువల్లే ప్రపంచవ్యాప్తంగా సైబర్ భద్రతా ఉద్యోగాలు దాదాపు సగం మేర భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయని టెక్నాలజీ, కన్సల్టింగ్ కంపెనీ యాక్సెంచర్ వెల్లడించింది. 5,50,000 కంటే ఎక్కువ సైబర్ సెక్యూరిటీ ఉద్యోగ ప్రకటనలు, ప్రొఫెషనల్ ప్రొఫైల్స్‌ను యాక్సెంచర్ విశ్లేషించి, 'రీఇన్వెంటింగ్ ది సైబర్ వర్క్‌ఫోర్స్' పేరుతో రూపొందించిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం 46% సైబర్ భద్రతా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. సాంకేతిక నైపుణ్యం, వ్యాపార పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాల సమ్మేళనం అవసరమయ్యే ఉద్యోగాలు 59% ఉండగా, 40% మంది ఉద్యోగులే పని చేస్తున్నారని నివేదిక పేర్కొంది. ఆధునిక సైబర్ సెక్యూరిటీ అనేది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ఏఐ వినియోగం, నియంత్రణ జవాబుదారీతనం, కార్యాచరణ స్థితిస్థాపకత, వినియోగదార్ల విశ్వాసం అనే అంశాలపై ఆధారపడి ఉంది. సంస్థాగత స్థాయిలో సమర్థంగా పని చేయడానికి అవసరమైన సాంకేతికత, సాఫ్ట్ స్కిల్స్ ఉన్నాయా, లేదా అనేది ఉద్యోగార్థుల్లో ముఖ్యమని వెల్లడించింది. 2005-15 కాలంలో 3.3 ఏళ్లుగా ఉన్న సైబర్ భద్రతా నిపుణుల సగటు ఉద్యోగ కాలం, 2015-25లో 1.8 ఏళ్లకు తగ్గింది. ఉద్యోగుల వలసల ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, సంస్థాగత పెట్టుబడుల కొరతా అధికంగానే ఉంది. 30% కంటే తక్కువ సంస్థలు మాత్రమే వ్యవస్థీకృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తున్నాయి. 57% సంస్థలు ప్రతిభ కొరతకు ప్రత్యక్ష కారణం తగినంత అంతర్గత పెట్టుబడి తమ వద్ద లేకపోవడమే అని పేర్కొన్నాయి.



కృత్రిమ మేధ (ఏఐ) వేగవంత పురోగతి ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. 2020 నుంచి ఏఐ సంబంధిత సైబర్ భద్రతా నైపుణ్యాలకు గిరాకీ రెట్టింపునకు పైగా పెరిగింది. 'సైబర్ రక్షణలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. కానీ అది మానవ విచక్షణతోనే పని చేయాలి. మెరుగైన నిర్ణయాలు తీసుకునేలా చేసే నైపుణ్యాలు, విచక్షణ, కార్యాచరణ నమూనాలతో కూడిన సైబర్ ఏఐకి సిద్ధంగా ఉన్న కార్మిక శక్తిని ప్రస్తుతం సిద్ధం చేయాల్సిన అవసరం ఉంద'ని యాక్సెంచర్ సైబర్ సెక్యూరిటీ గ్లోబల్ లీడ్ హర్‌ప్రీత్ వెల్లడించారు.




## తన్మయ్ అగర్వాల్ సెంచరీ.. పాలమూరు స్ట్రైకర్స్ టార్గెట్ 217

టీజీ20 లీగ్‌లో భాగంగా కరీంనగర్ డైమండ్స్, పాలమూరు స్ట్రైకర్స్ తలపడుతున్నాయి. ప్లే ఆఫ్స్‌నకు చేరాలంటే ఈ మ్యాచ్‌లో కరీంనగర్ తప్పక గెలవాల్సిందే. పాలమూరు జట్టు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌నకు దూరమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (109; 58 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సులు) సెంచరీ బాదాడు. ఈ సీజన్‌లో తన్మయ్‌కి ఇది రెండో శతకం. సాత్విక్ రెడ్డి (32), నారాయణ తేజ (23), చందన్ సహాని (16), HK సింహ (15), రాహుల్ రాదేశ్ (10) పరుగులు చేశారు. నిశాంత్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో సాత్విక్ వరుసగా ఐదు ఫోర్లు బాదడం విశేషం. పాలమూరు బౌలర్లలో అశ్వద్ 2, రిషభ్ బస్లాస్, మహ్మద్ అఫ్రిది, నిశాంత్ రెడ్డి ఒక వికెట్ పడగొట్టారు.

# భారత్ తడబాటుకు అదే కారణం.. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లు సాధించిన టీమ్‌ఇండియా తర్వాత ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల్లో ఓడిన టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌తో జరుగుతోన్న పొట్టి సిరీస్‌లోనూ నిరాశపరుస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఫామ్‌పై బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ మాట్లాడాడు. టీమ్‌ఇండియా ఛాంపియన్‌గా ఉన్నప్పటికీ.. జట్టు ఇంకా పరివర్తన దశలోనే ఉందన్నాడు. "బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో మెరుగుపడటానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆటలో ఇలాంటి ఫలితాలు సహజం. జట్టు పరివర్తన దశలో ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయి. కెప్టెన్ మారాడు. హార్దిక్ పాండ్య అందుబాటులో లేడు, అలాగే యువ ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. ఓటములను ఎవరూ కోరుకోరు. అప్పుడప్పుడూ ఇలాంటివి జరగొచ్చు. ఏదేమైనా భారత జట్టు ప్రయత్నాలు మాత్రం అలాగే కొనసాగుతాయి" అని సితాన్షు స్పష్టం చేశాడు. టీ20 క్రికెట్‌లో ఆల్‌రౌండర్ల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ.. హార్దిక్ పాండ్య అందుబాటులో లేనప్పుడు బ్యాకప్ ఆటగాళ్లను సిద్ధం చేసే దిశగా జట్టు కృషి చేస్తోందని పేర్కొన్నాడు. "టీ20ల్లో పేస్ ఆల్‌రౌండర్‌ను ఆరో బౌలర్‌గా పరిగణిస్తే వారు కీలక పాత్ర పోషిస్తారు. ఎక్కువమంది యువ ఆటగాళ్లు ఉన్నప్పుడు 15 మందికీ ఆడే అవకాశం దక్కకపోవచ్చు. కనీసం జట్టుతో పాటు ఉండటం వల్ల వారు ఆ వాతావరణానికి అలవాటు పడతారు" అని వివరించాడు. ఇవాళ ఇంగ్లాండ్, భారత్ మధ్య మూడో టీ20 మ్యాచ్ నాటింగ్‌హామ్ వేదికగా జరగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టీ20 వర్షం వల్ల రద్దు కాగా.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించింది.



# ఫుట్‌బాల్ అంటే అంతే.. పోర్చుగల్ నిష్క్రమణపై రొనాల్డో



ఫిఫా ప్రపంచ కప్‌లో పోర్చుగల్‌తో జరిగిన రౌండ్ 16 మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో విజయం తో స్పెయిన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరు కోగా.. పోర్చుగల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో ఫిఫా ప్రపంచ కప్ గెలవాలనుకున్న ఆ జట్టు స్టార్ క్రిస్టియానో రొనాల్డో కల కలగానే మిగిలిపోయింది. తనకు ఇదే చివరి ప్రపంచకప్ అని అంతకుముందే రొనాల్డో ప్రకటించాడు. తమ జట్టు వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించిన తర్వాత అతడు తీవ్ర భావోద్వేగానికి గురై.. కంటతడి పెట్టాడు. ప్రపంచ కప్ తర్వాత రొనాల్డో ఆటకు వీడ్కోలు పలుకుతాడని అతడి సోదరి పేర్కొంది. అయితే, స్పెయిన్‌తో మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన అతడు అలాంటి ప్రకటన ఏమీ చేయలేదు. తాను ఇకపై ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోనని తెలిపాడు. "ఈ విధంగా ప్రపంచ కప్ నుంచి నిష్క్రమిస్తుండటం నాకు బాధగా ఉంది. నా సర్వశక్తులూ ఒడ్డి పోరాడా. అత్యుత్తమ కృషి చేశా. అందుకే ప్రశాంతమైన మనసుతోనే వెనుదిరుగుతున్నా. ఇది నా చివరి ప్రపంచ కప్. ఇకపై ఆలోచించుకోవడానికి, నా కుటుంబంతో గడపడానికి నాకు సమయం దొరుకుతుంది. నేను ఆవేశంలో ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోను. పోర్చుగల్ (Portugal) తరఫున మూడు టైటిళ్లు గెలిచా. నేను రాకముందు మా జట్టు ఒక్క టైటిల్ కూడా సాధించలేదు. మా జాతీయ జట్టు ఇప్పటివరకు గెలిచిన అతిపెద్ద టైటిల్ 2016లో సొంతం చేసుకున్న యూరోపియన్ ఛాంపియన్‌షిప్. నిజం చెప్పాలంటే అది నాకు ప్రపంచ కప్‌తో సమానం" అని రొనాల్డో పేర్కొన్నాడు. ప్రపంచ కప్ నుంచి జట్టు నిష్క్రమించిన వెంటనే రాజీనామా చేయాలని నిర్ణయించుకున్న పోర్చుగల్ కోచ్ రాబర్టో మార్టినెజ్‌ను రొనాల్డో ప్రశంసించాడు. "మార్టినెజ్‌తో కలిసి పనిచేయడం నాకు చాలా ఇష్టం. ఆయన గొప్ప వ్యక్తి. పోర్చుగల్ కోసం చేసిన కృషి ప్రశంసనీయం. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా.

# ఫిఫా ప్రపంచకప్ నుంచి అమెరికా ఔట్



ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన ఆతిథ్య అమెరికా జట్టు ఫిఫా ప్రపంచ కప్ (FIFA WORLD CUP) పోటీ నుంచి నిష్క్రమించింది. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్‌లో బెల్జియం 4-1 తేడాతో అమెరికాను చిత్తుగా ఓడించింది. ఈ విజయంతో బెల్జియం క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఆ జట్టు ఆటగాడు చార్లెస్ డి కెటెలారే రెండు గోల్స్ చేయడంతో పాటు మరో గోల్‌కు సహకరించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. అమెరికా తరఫున మాలిక్ టిల్‌మన్ ఒక ఫ్రీకిక్ ద్వారా ఏకైక గోల్ సాధించాడు.

అమెరికా ఓటమిపై కోచ్ మారిసియో పోచెట్టినో అసహనం వ్యక్తం చేశాడు. కోపంతో బెంచ్ ముందున్న ర్యాక్‌ను తన్నగా దానిపై ఉన్న నాలుగు వాటర్ బాటిళ్లు ఎగిరిపడ్డాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకుని మరీ ఫిఫా సస్పెన్షన్ విధించిన ఆటగాడు బాలోగన్‌ను జట్టులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అయినా అమెరికా చిత్తుగా ఓడిపోవడం గమనార్హం. ట్రంప్ సస్పెన్షన్ ఎత్తివేయించి తీసుకొచ్చినా.. బాలోగాన్ వల్ల జట్టుకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

# పృథ్వీ షాతో బ్రేకప్ వార్తలు.. క్లారిటీ ఇచ్చిన ఆకృతి అగర్వాల్

భారత క్రికెటర్ పృథ్వీ షాతో విభేదాలు తలెత్తి బ్రేకప్ అయినట్లు వస్తున్న వార్తలను అతడి కాబోయే భార్య ఆకృతి అగర్వాల్ ఖండించారు. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. తమ మధ్య విభేదాలు లేవని, సంతోషంగా ఉన్నామని సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు. వీరిద్దరికి ఈ ఏడాది మార్చిలో నిశ్చితార్థమైంది. అయితే, రెండ్రోజుల క్రితం ఆకృతి తన ఇన్‌స్టా స్టోరీలో ఎవరి పేరును ప్రస్తావించకుండా 'నేను మోసపోయా. అతడితో కలిసి జీవితంలో ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నాక ఇదంతా నమ్మలేకపోతున్నా. అతడి గురించి సామాజిక మాధ్యమాల్లో చూసిందంతా నిజమే. వదంతులన్నీ వాస్తవమే' అని రాసుకొచ్చారు. దీంతో వీరిద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు నెట్టింట ప్రచారం జరిగింది. ఆ వార్తలను ఆకృతి ఖండిస్తూ నెటిజన్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తన పోస్టులో పృథ్వీ షా పేరును ఎక్కడా ప్రస్తావించలేదని.. అయినా కొందరు అంత త్వరగా దాన్ని అతడికి ముడిపెట్టడం చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. ఆ ఊహాగానాలు అతడి ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉండటంతో చివరికి తానే మాట్లాడాల్సి వచ్చిందని వివరించారు. 'ఒక విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నాను. నేను ఎక్కడా నా కాబోయే భర్త పేరును ప్రస్తావించలేదు. అలాగే మా నిశ్చితార్థం రద్దయిందని గానీ, మేము విడిపోయామని గానీ చెప్పలేదు. ఆ పోస్టు పృథ్వీ షా గురించే పెట్టానని చాలామంది భావించడం దురదృష్టకరం. మేము కలిసి సంతోషంగా ఉన్నాం. మా బంధం కొనసాగుతుంది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## రావు బహదూర్ తెలుగు సినిమాకి రిఫరెన్స్ పాయింట్ అవుతుంది:యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య



**వుదయం సినిమా :**
ఇంత అద్భుతమైన సినిమా అందించిన చిత్రబృందంలోని ప్రతి ఒక్కరికీ నా అభినందనలు: సత్యదేవ్ కథానాయకుడిగా వెంకటేష్ మహా దర్శకత్వం వహించిన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'రావు బహదూర్'. సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్‌ల జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో,అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర ఈ చిత్రాన్ని నిర్మించారు. జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని ఘన విజయంతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.తాజాగా 'రావు బహదూర్' చిత్రాన్ని వీక్షించిన యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య చిత్రబృందాన్ని కలిసి తన అభినందనలు తెలియజేశారు.

## శరవేగంగా సాగుతోన్న చిరు యాక్షన్ షెడ్యూల్

**వుదయం సినిమా :**
'వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం #ChiruBobby2 / #Chiru158. KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది.
ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్ లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా రూపొందుతున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు.
అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన 'టైటిల్ టీజర్'ను విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నద్ధమవుతోంది.
ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషినల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు.



## షూటింగ్‌లో జాయిన్ అయిన విక్టరీ వెంకటేష్

**వుదయం సినిమా :**
విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న #VenkyAnil5 (#NKRAR2) చిత్రం కోసం జతకట్టారు. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కల్యాణ్ రామ్ పుట్టినరోజున విడుదలైన ఆయన 'ఫస్ట్‌లుక్' పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.
కల్యాణ్ రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఒక పాట షూటింగ్‌ను చిత్ర బృందం ఇటీవల పూర్తి చేసింది.
ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ షూటింగ్ సెట్‌లో చేరారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంతో కూడిన కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. వెంకటేష్, కీర్తి సురేష్, కృతి శెట్టిలతో కలిసి కల్యాణ్ రామ్ కూడా ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారు.



## రామ్ పోతినేని చిత్రానికి స్టార్ కంపోజర్ సామ్ సిఎస్ మ్యూజిక్



**వుదయం సినిమా :**
ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రం #RAPO23. ఈ చిత్రంలో రామ్ హీరోగా నటిస్తూ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్ పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ తెరకెక్కుతున్న చిత్రం ఇది.ఈ సినిమా షూటింగ్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. ఖైదీ, పుష్ప 2, మహా అవతార్ నరసింహ వంటి చిత్రాలకు అదిరిపోయే సౌండ్ ట్రాక్స్ అందించిన సామ్ సిఎస్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. #RAPO23లో సామ్ సిఎస్ చేరడంతో మ్యూజికల్ కూడా ఈ చిత్రం భారీ అంచనాలని నెలకొల్పింది. #RAPO23లో మ్యూజిక్ నెక్స్ట్ లెవల్ లో ఉండబోతోంది.దర్శకత్వం, కథతో పాటు కథానాయకుడిగానూ నటిస్తున్న ఈ చిత్రంలో రామ్ కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రను పోషించబోతున్నారు.

## 'మారెమ్మ' సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో మాధవ్

నిర్మాత మయూర్ రెడ్డి బండారు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ పాట మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది.



**వుదయం సినిమా :**
మాధవ్, దీపా బాల, మంచాల నాగరాజ్, మయూర్ రెడ్డి బండారు, మోక్ష ఆర్ట్స్ 'మారెమ్మ' మారి సాంగ్ లాంచ్మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగు పెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి ప్రశాంత్ ఆర్ విహారి మ్యూజిక్ అందిస్తున్నారు. తాజాగా మేకర్స్ మారి సాంగ్ ని లాంచ్ చేశారు.ఈ పాటకు మిట్టపల్లి సురేందర్ అందించిన సాహిత్యం ఆకట్టుకుంది. మంగ్లీ వోకల్స్ మరో ఆకర్షణగా నిలిచింది.ఈ సినిమా తెలంగాణ నేటివిటీ, తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కింది. నాగరాజు ఈ కథ చెప్పగానే మా ఊరి నేపథ్యం మొత్తం నాకు గుర్తొచ్చింది. దర్శకుడు మంచాల నాగరాజు మాట్లాడుతూ.. ఈ సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. విడుదలకు సిద్ధంగా ఉన్నాం. తెలుగులో ఇది చాలా కొత్త స్క్రీన్‌ప్లేతో ఉండే సినిమా. 'మారి' పాటలో తమోగ్న, సర్కార్ ఇద్దరూ చాలా బ్యూటిఫుల్‌గా చేశారు. మంగ్లీ కూడా అద్భుతంగా పాడారు.

## చెన్నై లవ్ స్టోరీ "టీమ్ సమక్షంలో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్



**వుదయం సినిమా :**
కల్ట్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ బర్త్ డే సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ ఎఫ్ ఎన్ సీసీ లో చెన్నై లవ్ స్టోరీ మూవీ టీమ్ సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం, ప్రొడ్యూసర్, డైరెక్టర్ సాయి రాజేష్, నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ఎస్ కేఎన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ మా మిత్రుడు ఎస్ కే ఎన్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలి. ఏడాదికి రెండు చిత్రాలు నిర్మించాలి. ఇండస్ట్రీకి మంచి హిట్ సినిమాలు అందించాలి. అన్నారు.హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ ఎస్ కేఎన్ గారు ఇలాగే ప్రతి పుట్టినరోజు హ్యాపీగా జరుపుకోవాలి. మరెన్నో మంచి చిత్రాలు నిర్మించాలి. ఆ చిత్రాల్లో మాలాంటి వాళ్లకు అవకాశాలు కల్పించాలని కోరుకుంటున్నా. అన్నారు.

## మహేష్ కాంపెల్లి 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' టీజర్ లాంచ్ ఈవెంట్

**వుదయం సినిమా :**
మహేష్ కాంపెల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వ్యూ: ది పాయింట్ ఆఫ్ వ్యూ' చిత్ర టీజర్‌ను చిత్రబృందం నేడు ఘనంగా విడుదల చేసింది. మిస్టరీ, సస్పెన్స్, ఎమోషనల్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.కార్తికేయ సమర్పణలో పరవాణి చలనచిత్ర బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం విభిన్నమైన కథనంతో తెరకెక్కుతోంది. "ది పాయింట్ ఆఫ్ వ్యూ" అనే ట్యాగ్‌లైన్‌నే కథలోని ప్రధాన అంశాన్ని ప్రతిబింబిస్తోంది. టీజర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఘనంగా మీడియా సమావేశాన్ని నిర్వహించింది.




**ఈ సందర్భంగా...**
నిర్మాత సత్య చౌదరి మాట్లాడుతూ.. "మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. నేను వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌ని. కానీ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. దాదాపు పదేళ్ల క్రితం మహేష్ ఈ కథను నాకు వినిపించారు. ఒక మహిళా ప్రధాన కథతో మంచి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించాను. నా తొలి నిర్మాణంతో ఇద్దరు తెలుగు హీరోయిన్లను పరిచయం చేయడం ఆనందంగా ఉంది. సినిమా రంగం నాకు కొత్త అయినప్పటికీ మహేష్ ప్రతి విషయంలో నాకు అండగా నిలిచారు. మా హీరోయిన్లు, సాంకేతిక నిపుణులందరికీ ధన్యవాదాలు" అన్నారు.హీరోయిన్ పూజా రెడ్డి మాట్లాడుతూ.. "మా టీజర్ విడుదల కార్యక్రమానికి వచ్చిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. మహేష్ గారు కథ చెప్పిన వెంటనే ఇది నాకు మంచి అవకాశం అని భావించాను. ఈ సినిమాలో నటించడం చాలా ఆనందంగా ఉంది. నాకు అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాతలకు ధన్యవాదాలు. మా టీజర్‌ను ఆదరించినట్లే సినిమా విడుదలైన తర్వాత కూడా ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు.దర్శకుడు మహేష్ కాంపెల్లి మాట్లాడుతూ.. "ఇది నా తొలి దర్శకత్వ చిత్రం. నేను ఇంతకుముందు ఏ దర్శకుడి దగ్గరా పని చేయలేదని నిర్మాత సత్య గారికి ముందే చెప్పాను. అయినప్పటికీ నేను రాసుకున్న కథపై పూర్తి నమ్మకం ఉంది. దిశ ఘటనతో పాటు కొన్ని వాస్తవ సంఘటనల నుంచి ప్రేరణ పొందిన ఈ కథ ద్వారా మహిళల పట్ల సమాజంలో అవగాహన పెంచే బలమైన సందేశాన్ని ఇవ్వాలనుకున్నాను. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు.అన్విధ్ మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో కీలక పాత్ర ఇచ్చిన సత్య గారికి, మహేష్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మా సినిమాకు అండగా నిలుస్తున్న మీడియా, నా కుటుంబ సభ్యులు, స్నేహితులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు" అన్నారు.



## ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా నిర్మిస్తున్న తొలి చిత్రం అనౌన్స్‌మెంట్

**వుదయం సినిమా :**
అశ్వత్ మారిముత్తు, మమిత బైజు హీరో హీరోయిన్స్ గా, ది ఆల్ఫా యూనిట్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ మ్యూజిక్ ఆకట్టుకున్న అనౌన్స్‌మెంట్ వీడియోరచయితగా, దర్శకుడిగా, హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. "పీఆర్ షో" పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్‌లో తొలి సినిమాగా, డ్యూడ్ సినిమాలో ఆయనతో కలిసి నటించిన మమిత బైజు, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ సొంటినేని, స్వాసిక, అనామిక మహి, లిజ్జీ ఆంటోని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న సాయి అభ్యంక్కర్ మ్యూజిక్ అందిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్‌ను స్టైలిష్ అనౌన్స్‌మెంట్ వీడియోతో అధికారికంగా ప్రకటించారు. ఇందులో నటీనటులు, టెక్నికల్ టీమ్‌ను ఆసక్తికరంగా పరిచయం చేశారు. ఈ సినిమాకు కథను ప్రదీప్ రంగనాథన్ అందించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు కూడా చేపట్టారు.ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను ది ఆల్ఫా యూనిట్ పేరుతో పరిచయం చేసిన ఆరుగురు సభ్యుల బృందం నిర్వహిస్తోంది. ఇందులో విశాల్ టీఆర్, యష్ వి, నరేన్ సోడా, చాణక్కి యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఉన్నారు. ఒకే సినిమాకు ఆరుగురు కలిసి దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.




## హృదయం మురళి అందరికీ రిలేట్ అయ్యే సినిమా

**వుదయం సినిమా :**
ఫహాద్ ఫాజిల్, తమన్ గారితో కలిసి పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్న మైత్రి డిస్ట్రిబ్యూటర్స్‌కు ధన్యవాదాలు: ప్రెస్ మీట్‌లో హీరో అథర్వాఅథర్వా, ప్రీతి ముకుందన్, కయదూ ప్రధాన పాత్రల్లో ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హృదయం మురళి. ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషించారు. మైత్రీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ చిత్రం జూలై 10న తెలుగులో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరో అథర్వా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. తెలుగు ప్రేక్షకులు చూపించే ఆదరణ చాలా అద్భుతం. నా గత చిత్రాలకు ఎంతో ప్రేమను అందించారు. 'హృదయం మురళి' స్పెషల్ సినిమా.ఈ సినిమాలో నటించిన వారందరూ చాలా మంచి ఫ్రెండ్స్ అయ్యారు. ఈ సినిమా ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. ప్రతి ఒక్కరి మనసుకు దగ్గరగా ఉండే సినిమా ఇది. జూలై 10న సినిమా విడుదల అవుతోంది. అందరూ థియేటర్లకు వచ్చి చూడాలని కోరుకుంటున్నాను.

## అంతర్యామి" షూటింగ్ పూర్తి

**వుదయం సినిమా :**
ఒడిషా సూపర్ స్టార్ బాబుషాన్ మొహంతి, అందాల నటి వేద్విక సోని హీరో హీరోయిన్లుగా దర్శకుడు శివ సత్యం దర్శకత్వంలో రూపొందుతున్న విభిన్న కథా చిత్రం "అంతర్యామి". ఈ చిత్రాన్ని నిర్మాత జ్ఞానరంజన్ సాహు నిర్మిస్తుండగా, అమృత్ నిషాద్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. చిత్రీకరణ అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.